
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
సోమవారం 2 డిసెంబరు 2024

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక : కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ భాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని, జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

బెల్టు తీసేదెవరు..?



- ఊరూవాడా బెల్ట్ షాపులు
- పల్లెసీమల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- నవంబరులో మద్యం అమ్మకాలు రూ.75 కోట్లు
- బెల్ట్ షాపుల వాటా రూ.25 కోట్లు పైమాటే
- కొరవడిన ఎక్సైజ్ నిఘా
- టీడీపీ కూటమి నాయకుల అండతో రెచ్చిపోతున్న మద్యం మాఫియా
- సీఎం చంద్రబాబు హెచ్చరికతోనైనా బెల్ట్ షాపులకు కళ్లెం వేస్తారా..?

ఆంధ్రజ్యోతి పరిశీలన

దేవనకొండ మండలం పి.కోటకొండ గ్రామ జనాభా దాదాపు పది వేలు. ఇక్కడ 30కి పైగా మద్యం బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. దక్షిణాది ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయంలో రాఘవేంద్రపురం, తుంగభద్ర నది ఒడ్డున రెండు మద్యం బెల్ట్ దుకాణాల్లో మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా యంత్రాంగం ఉండే కర్నూలు నగర శివారుల్లోని వీకర్ సెక్షన్ కాలనీల్లో గల్లీకో బెల్ట్ షాపు.. ఇలా ఒక్కచోట కాదు జిల్లా అంతటా ఇదే పరిస్థితి. పల్లెపల్లెన మద్యం ఏరులై పారుతోంది. టీడీపీ కూటమి ముఖ్య ప్రజాప్రతినిధుల అండదండలు, ఎక్సైజ్ నిఘా కళ్లకు గంతలు కట్టుకోవడం వెరసి ఊరూ, వాడా మద్యం బెల్ట్ షాపులు బార్లా తెరుచుకున్నాయి. మద్యం, ఇసుక, ఎర్రమట్టిలో జోక్యం చేసుకోవద్దని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ వైపు హెచ్చరిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో బెల్ట్ షాపులకు కళ్లెం వేసేదెవరు..? జిల్లాలో మద్యం బెల్ట్‌షాపులపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే వెలుగు చూసిన వాస్తవాలపై ఆంధ్రజ్యోతి కథనం.

కర్నూలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా వ్యాప్తంగా జిల్లాలో 99 మద్యం దుకాణాలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం వ్యాపారం చేస్తే.. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక 2019కి ముందు తరహాలో ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు అప్పగించింది. రెండేళ్ల లీజుకు దరఖాస్తులు స్వీకరిస్తే 3,046 మంది దరఖాస్తులు చేశారు. రుసుం రూపంలో రూ.60 కోట్లకుపైగా ఖజానాకు ఆదాయం వచ్చింది. లాటరీ ద్వారా మద్యం షాపులు లీజుదారులకు అప్పగించారు. నవంబరు ఒకటో తేదీన లీజుదారులు మద్యం షాపుల్లో అమ్మకాలకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు పోయి.. ప్రైవేటు వైన్స్ వచ్చాయి. కావాల్సిన బ్రాండ్లు కొనుకోవచ్చు. అయితే.. ఎక్కడో ఉన్న లైసెన్స్‌డ్ మద్యం షాపులకు వెళ్లి కొనుక్కునేందుకు ఇబ్బంది పడకుండా.. మద్యం ప్రియులకు అందుబాటులోకే మద్యం అన్నట్లు పల్లెపల్లెన.. వీధివీధిన బెల్ట్ షాపులు బార్లా తెరుచుకున్నాయి. టీడీపీ కూటమి ముఖ్య ప్రజాప్రతినిధులు, వారికి సన్నిహితంగా ఉండే కీలకమైన నాయకుల అండతో ఈ భాగోతం సాగుతున్నట్లు తెలుస్తోంది. మద్యం అమ్మకాలు, బెల్ట్ షాపుల నిర్వహణలో ఈ స్థాయిలో రాజకీయ జోక్యం మునుపెన్నడు చూడలేదని ఎక్సైజ్ శాఖ అధికారి ఒకరు ఆవేదన వ్యక్తం చేశారంటే ఏ స్థాయిలో విస్తరించారో ఇట్టే తెలుస్తుంది.



కర్నూలు నగరంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయం



పెద్దకడుబూరు బెల్టు షాపునకు ఆటోలో తరలిస్తున్న మద్యం కేసులు



ఒక్కో బెల్ట్ షాపునకు ఒక్కో రేటు

కర్నూలు సిటీ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 31, కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 14, ఎమ్మిగనూరులో 15, కోసిగిలో 4, పత్తికొండలో 14, ఆదోనిలో 12, ఆలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 9 లైసెన్స్‌డ్ మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్కో మండలంలో ఒకటి రెండు మద్యం షాపులు ఉంటే.. ఏ పల్లెకు వెళ్లినా ఏమున్నది గర్వకారణం.. వీధివీధిన... సందుసందున మద్యం బెల్ట్ షాపులే అన్నట్లుగా మార్చేశారు. ప్రతి పల్లెలో 3 నుంచి 5 బెల్ట్ షాపులు ఉంటే, పెద్ద గ్రామాల్లో 10-15కిపైగా ఉన్నట్లు సమాచారం. ఒక్కో బెల్ట్ షాపునకు ఒక్కో రేట్ చొప్పున మద్యం షాపుల యజమానులు రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు డిపాజిట్ రూపంలో వసులు చేశారు. డిమాండ్ ఉన్న పల్లెల్లో రూ.లక్ష వరకు తీసుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఎక్సైజ్ నిఘా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి షాపు నుంచి నెల మాముళ్లు నిర్ణయించడం, ముఖ్య ప్రజాప్రతినిధులు జోక్యంతో ఎక్సైజ్, పోలీస్ యంత్రాంగం చూసిచూడనట్లు వెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బెల్ట్ షాపుల నిర్వహణలో అధికార టీడీపీ కూటమి నేతలతో పాటు ప్రతిపక్ష వైసీపీ నాయకులు ఉండడం కొసమెరుపు.

మిగతా 7లో..

రైతులను మోసగిస్తే చర్యలు

కమీషన్ ఏజెంట్లకు మార్కెట్ యార్డు కార్యదర్శి హెచ్చరిక



రైతులు చెల్లించాల్సిన మొత్తంపై బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో రైతులను కమీషన్ ఏజెంట్లు మోసం చేస్తే సహించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి జయలక్ష్మి హెచ్చరించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతులకు పంట ఉత్పత్తులు మార్కెట్ యార్డుకు తీసుకువచ్చిన తర్వాత హమాలీలకు ఎంత మొత్తం చెల్లించాలో అవగాహన కల్పించేందు కోసం మార్కెట్ యార్డులో వివిధ ప్రాంతాల్లో బోర్డుపై తెలియజేశామన్నారు. వేరుశనగ, పూల విత్తనాలు, ఆముదాలు, మొక్కజొన్నలు, వాము, కందులు, శనగలు, ఎండుమిర్చి, ఉల్లిపాయలతో పాటు కొర్రలు, సజ్జ తదితర పంటలను విక్రయించేందుకు వచ్చిన రైతులపట్ల సానుకూలంగా వ్యవహరించాలన్నారు. వారి నుంచి అధిక మొత్తంలో డబ్బు వసూలు చేస్తే కమీషన్ ఏజెంట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. 2 శాతం కమీషన్ మాత్రమే వసూలు చేయాలని, హమాలీలు ఒక బస్తాకు రూ.12.81 మాత్రమే చెల్లించాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన ఏజెంట్లపై యార్డు కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కార్యదర్శి విజ్ఞప్తి చేశారు.

జగన్‌కు అవినీతి సామ్రాట్ అవార్డు


కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధ్వజం



కర్నూలు అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల కాలంలో ఏం చేశాడని జగన్ రెడ్డికి సత్కారాలు, సన్మానాలు చేయాలి. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చేసి, అవినీతికి పాల్పడిన ఆయనకు.. అవినీతి సామ్రాట్ అవార్డు ఇవ్వాలి...' అని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తనదైన శైలిలో విమర్శించారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమిశెట్టి విలేకరుల సమావేశం నిర్వహించి మాజీ సీఎం జగన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ వ్యవస్థను భ్రష్టుపట్టించి 9 సార్లు చార్జీలు పెంచినందుకు, ఐదేళ్లు అధికారం ఇస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేసినందుకు శాలువతో కప్పాలా అని ప్రశ్నించారు. దేశంలోనే అవినీతి సామ్రాట్ అని జగన్‌ను సన్మానం చేయవచ్చని విమర్శించారు. విద్యుత్ వ్యవస్థలను రూ. లక్ష కోట్ల అప్పుల ఊబిలోకి నేట్టేశారని దుయ్యబట్టారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. జగన్ అవినీతి దేశాలు దాటిపోయిందన్నారు. రాష్ట్రం పరువు తీయడమే కాకుండా గొప్పలకు పోతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అవినీతిని కూడా గొప్పగా చెప్పుకోవడం జగన్‌కే సాధ్యమైందని సోమిశెట్టి విమర్శించారు.

తుంగభద్రపై చెక్ డ్యాం కష్టతరం..!

- ప్రత్యేక కమిటీ అధ్యయనం చేయాలి
- రైల్వే శాఖ, సీడబ్ల్యూసీ అనుమతి తప్పనిసరి
- గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ఉత్తమ ప్రత్యామ్నాయం
- కర్నూలు నగరానికి నీటి లభ్యతపై ఇరిగేషన్ ఎస్ఈ నివేదిక



కర్నూలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరం భవిష్యత్తు తాగు నీటి అవసరాలు తీర్చడానికి గోరుకల్లు జలాశయం నుంచి నీటిని తీసుకోవడమే ప్రత్యామ్నాయమని జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బి.బాలచంద్రారెడ్డి కర్నూలు నగర పాలక సంస్థ ఎస్ఈ రాజశేఖర్‌కు పంపిన నివేదికలో పేర్కొన్నారు. కర్నూలు నగర జనాభా 6.50 లక్షలు దాటుతోంది. నగర శివారులో కాలనీలు విస్తరిస్తున్నాయి. భవిషత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అమృత్ 2.0లో భాగంగా నగర శివారులో రాఘవేంద్రస్వామి మఠం దగ్గర తంగభద్ర నదిపై 0.50 టీఎంసీల సామర్థ్యంతో చెక్ డ్యాం, హంద్రీ నదిపై కూడా చెక్ డ్యాం నిర్మాణం కోసం అవసరమైన నివేదిక ఇవ్వాలని కోరుతూ కర్నూలు కార్పొరేషన్ ఎస్ఈ రాజశేఖర్ ఇరిగేషన్ కర్నూలు సర్కిల్ ఎస్ఈ బాలచంద్రారెడ్డికి గత నెల 22న లేఖ రాశారు. తుంగభద్ర, హంద్రీ నదులపై చెక్ డ్యాంలు నిర్మించాలంటే సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో), ఇంజనీరింగ్ రీసెర్చ్ లేబొలేటరీ (ఈఆర్ఎల్) నిపుణుల కమిటీ సూచనలు మేరకు అధ్యయనం చేయాల్సి ఉందని వివరించారు. ప్రతిపాదిత ప్రాంతంలో చెక్ డ్యాం నిర్మిస్తే.. బ్యాక్ వాటర్‌లో రైల్వే నిర్మాణాలు (వంతెన) నిరంతరం నీటిలో మునిగే ఉంటుంది. దీంతో రైల్వే శాఖ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే.. ఈ రెండు నదులు కృష్ణా నదికి ఉప నదులు కావడంతో అంతర్రాష్ట్ర జల సమస్యలు తలెత్తకుండా కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదం తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. దీంతో తుంగభద్ర నదిపై చెక్ డ్యాం నిర్మాణం సాధ్యం కాకపోవచ్చని సూచించారు.

గోరుకల్లు నుంచి పైపులైన్ ఉత్తమం

కర్నూలు నగరానికి అందుబాటులో గాజులదిన్నె ప్రాజెక్టు, సుంకేసుల రిజర్వాయర్, శ్రీశైలం ఎగువన కృష్ణా నదిపై నిర్మించిన ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం, గోరుకల్లు రిజర్వాయర్లు ఉన్నాయి. గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) జలాశయం సామర్థ్యం 4.50 టీఎంసీలు. నాలుగు మండలాల్లో రబీలో 24 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలి. వేసవిలో మూడు మండలాలు, కర్నూలు నగరానికి తాగునీరు ఇవ్వాలంటే నీటి లభ్యత సాధ్యం కాదు. సుంకేసుల బ్యారేజీ సామర్థ్యం 1.20 టీఎంసీలే. కేసీ కెనాల్ ఆయకట్టుకు ఖరీఫ్, రబీకి సాగునీరు ఇవ్వాలి. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నీటిని తీసుకోవాలంటే.. శ్రీశైలం జలాశయం లెవల్ 800 అడుగులకు తగ్గితే ఎత్తిపోతలు సాధ్యం కాదు. అలాగే ఫిబ్రవరి, మార్చి తరువాత కృష్ణా నదిలో నీరు అందుబాటులో ఉండకపోవచ్చు. దీంతో ఈ మూడు నీటి వనరులు కర్నూలు నగరం భవిష్యత్తు తాగునీటి అవసరాలు తీర్చేందుకు సాధ్యపడకపోవచ్చని నివేదికలో వెల్లడించారు. అయితే పాణ్యం మండలం గోరుకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు సామర్థ్యం 12.44 టీఎంసీలు. డెడ్ స్టోరేజీ కెపాసిటీ 1.15 టీఎంసీలు. జూలై తరువాత కృష్ణా నదికి వరద రాగానే గోరకల్లు జలాశయాన్ని నింపుతారు. అదే క్రమంలో డెడ్ స్టోరేజీ నీరు నిరంతరం ఉంటుంది. కర్నూలు నగరం నీటి అవసరాల కంటే ఎక్కువ నీరు నిల్వ ఉంటుంది. దీంతో నగర భవిష్యత్తు తాగునీటి అసరాలు తీర్చేందుకు గోరుకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకోవడమే ఉత్తమ ప్రత్యామ్నాయమని ఆ నివేదికలో పేర్కొన్నారు. కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

కిక్కిరిసిన శ్రీశైలం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- ముగిసిన కార్తీక మాసోత్సవాలు

శ్రీశైలం, డిసెంబరు 1: (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసం పురస్కరించుకుని ఆదివారం క్షేత్రానికి పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో క్షేత్ర పురవీధులన్నీ భక్తులతో రద్దీగా దర్శనమిచ్చాయి. భక్తులు వేకువజాము నుంచే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో స్వామివారి అలంకరణ దర్శనం కల్పించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయ ఉత్తర వీధి ప్రాంగణం, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలు జరిపారు. ఆలయ అధికారులు క్యూలైన్లలో వేచివున్న భక్తులకు మంచినీళ్ళు, బిస్కెట్లు, అల్పాహారం అందజేశారు. సాయంత్రం స్వామివారికి పల్లకీ ఉత్సవం, ఆకాశదీపం కార్యక్రమాలను నిర్వహించారు.



స్వామివారి దర్శనానికి భక్తుల క్యూ

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

ధర్మపథంలో భాగంగా దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధనలో ఆదివారం సాయంత్రం ఖమ్మం జిల్లాకు చెందిన అభినందన రుద్ర నాట్యాలయం విద్యార్థులు సాంస్కృతిక నృత్యప్రదర్శన నిర్వహించారు. శివాష్టకం, మహిషాసుర మర్దిని, శివ తాండవం, శంభో శివ శంభో, ఓం నమఃశివాయ తదితర శైవ గీతాలకు రిధి, శైశాలి, జయకీర్తన, భవిష్య వర్ధిని, ఆరాధ్యశ్రీ, నిత్యశ్రీ, యశస్విని తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.



ఇళ్లు నిబంధనలకు చెల్లు..!

- నంద్యాల మున్సిపాలిటీలో జోరుగా అక్రమ నిర్మాణాలు
- అడ్డగోలు కట్టడాలను పట్టించుకోని అధికారులు
- నిబంధనలు కొందరికే అన్నట్టుగా వ్యవహార శైలి
- టౌన్‌ప్లానింగ్ విభాగం తీరుతో విస్తుపోతున్న జనం

నంద్యాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):



ఇది నంద్యాల పట్టణంలోని ఫరూఖ్ నగర్‌లో నిర్మిస్తున్న ఇల్లు. పంట కాలువను ఆక్రమిస్తూ ఈ ఇంటి నిర్మాణం చేపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పైగా దీనికి ఎలాంటి అనుమతుల్లేవని అధికారులే స్వయంగా చెబుతున్నారు. అయినా ఇంటి నిర్మాణం దాదాపు సగానికి పైగా పూర్తయింది. ఇదేమిటని అడిగితే.. ఇంటి నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చామని అధికారులు సమాధానమిస్తున్నారు.

ఇలాంటి నిర్మాణాలు నంద్యాల మునిసిపాలిటీ పరిధిలో కొల్లలుగా ఉన్నాయని తెలుస్తోంది. అధికారులు వీటి వంక కనీసం కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారులు అన్నింటి పట్ల ఇదేవిధంగా వ్యవహరిస్తున్నారా అంటే అదీ లేదు. చాలా ఇంటి నిర్మాణాలకు సంబంధించి నిబంధనలు సరిగా లేవంటూ అనుమతులు మంజూరు చేయటం లేదు. ఒకే మునిసిపాలిటీ పరిధిలోని కొన్ని నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న అధికారులు, మిగతా వాటిని చూసీ చూడనట్లుగా ఎందుకు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అడిగింది సమర్పించు కోలేని వారి పట్ల ఓ విధంగా, అనుకూలంగా ఉన్న వారి పట్ల మరోవిధంగా వ్యవహరిస్తూ అధికారుల పక్షపాతం చూపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

కొన్నింటికే ఎందుకు?

ఇంటి నిర్మాణం చేపట్టే యజమానులు సంబంధిత మున్సిపాలిటీ నియమ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. సెంటున్నర, ఆపైన స్థలంలో ఇంటిని నిర్మించే ప్రతి నిర్మాణదారుడు మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం ఇంటి ప్లానుతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క నిబంధన సరిగా లేకపోయినా మున్సిపాలిటీలో ఏసీపీ (అసిస్టెంట్ సిటీ ప్లానర్), టౌన్ ప్లానింగ్ అధికారులు దరఖాస్తును వెనక్కి పంపుతారు. దీనిని షార్ట్‌ఫాల్ అంటారు. ఇలాంటి షార్ట్‌ఫాల్ దరఖాస్తులు నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 200 వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అధికారులు తీరుతో షార్ట్‌ఫాల్ దరఖాస్తులకు సంబంధించి నిర్మాణదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. నిబంధనలు లేవంటూ తమని నెలలుగా తిప్పుతూ అనుమతులు ఇవ్వటం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు సెంటున్నర లోపు ఇళ్ల కట్టుకునే వారి పట్ల కూడా మున్సిపాలిటీ అధికారులు ఇదే తీరుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి సెంటున్నర లోపు స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టే వారు ఎలాంటి అనుమతులు తీసుకోవాల్సిన అవసరం లేదు. కానీ బ్యాంకు లోను వస్తుందన్న ఆశతో చాలా మంది పేద, మధ్య తరగతి వారు మున్సిపాలిటీ అనుమతులు కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇలాంటి వారి విషయంలో కూడా సంబంధిత మున్సిపల్ అధికారులు దరఖాస్తులను షార్ట్‌ఫాల్‌లో పెడుతున్నట్లు సమాచారం. డబ్బులు దండిగా ఉండి, అడిగినంత ఇచ్చేవారు నిబంధనలను ఉల్లంఘించి కట్టుకుంటున్నా మున్సిపాలిటీ అధికారులు పట్టించు కోవటం లేదని, డబ్బులు సమర్పించుకోలేని పేద, మధ్య తరగతి వారి ఇంటి నిర్మాణ దరఖాస్తులను మాత్రం పెండింగ్‌లో పెడుతూ సతాయిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మిగతా 7లో..

నిబంధనలు కొందరికేనా..?

సాధారణంగా ఇంటి నిర్మాణదారులు అనుమతుల కోసం మున్సిపాలిటీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. వీటిని సంబంధిత వార్డు ప్లానింగ్ సెక్రటరీలు అనుమతుల కోసం మున్సిపాలిటీకి పంపించాల్సి ఉంటుంది. దరఖాస్తులను అలా పంపించకుండా వార్డు సచివాలయ పరిధిలోనే నిలిపివేస్తే 15 రోజుల తర్వాత డీమ్డ్‌గా చూపుతాయి. డీమ్డ్ అంటే అనుమతులు నిరాకరించినట్లు కాదు, అలా అని అనుమతులు మంజూరు చేసినట్లు కాదు. దరఖాస్తు చేసుకున్న యజమానులు మాత్రం ఇంటి నిర్మాణాలను చేపడుతున్నారు. అయితే ఇదంతా ఓ పద్ధతి ప్రకారం అధికారులు, సచివాలయ ప్లానింగ్ ఉద్యోగులు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. నిర్మాణ అనుమతుల కోసం చేసుకున్న దరఖాస్తులను అధికారుల సాయంతో సచివాలయ ప్లానింగ్ ఉద్యోగులు పైకి పంపించకుండా నిలిపివేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా కావాలని 15 రోజులు నిలిపివేస్తుండటంతో అవన్నీ డీమ్డ్ కింద పడిపోతాయి. ఇలాంటి డీమ్డ్ దరఖాస్తులు దాదాపు నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 260కి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి డీమ్డ్ దరఖాస్తులుగా ఉన్న వాటికి సంబంధించిన ఇంటి నిర్మాణాలను పరిశీలించి వాటిని అధికారులు నిలిపివేయాల్సి ఉన్నా పట్టించుకోవటం లేదు. ఇలాంటి నిర్మాణాలు ఎక్కువగా మహానంది రోడ్డులోని బంగారుపుట్ట, రైతు నగరం, జగజ్జనని నగర్ వంటి ప్రాంతాల్లో జరుగుతున్నాయని తెలుస్తోంది. మున్సిపాలిటీ నుంచి అనుమతుల్లేకపోయినా వీటి నిర్మాణాలు నిరభ్యంతరంగా ఎలా సాగుతున్నాయనే సందేహాలు వెలువడుతున్నాయి. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణాలకు అనుమతులు రావు కాబట్టి తామే డీమ్డ్ కిందకు వెళ్లేలా అధికారులే చేయిస్తున్నారని తెలుస్తోంది. అందుకు ప్రతిఫలంగా ఆయా ఇంటి నిర్మాణదారుల నుంచి డబ్బులు దండుకుంటూ అనుమతుల్లేని నిర్మాణాలు కొనసాగేలా సాయం చేస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

బెల్టు తీసేదెవరు..?

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వ లైసెన్స్ ఉన్న మద్యం షాపులో విక్రయించే ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు బెల్టు షాపులు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం సామాన్యులకు నాణ్యమైన మద్యం తక్కువ ధరకు ఇవ్వాలనే లక్ష్యంగా రూ.99లకే క్వార్టరు లిక్కరు తీసుకొచ్చారు. ఇదే సీసా గ్రామాల్లోని బెల్టు షాపుల్లో రూ.125ల నుంచి రూ.150ల వరకు విక్రయిస్తున్నారు. ఇతర బ్రాండ్ల మద్యం క్వార్టర్ సీసా, బీరు సీసాపై ఎమ్మార్పీ కంటే రూ.15 నుంచి రూ.25ల వరకు అదనంగా వసులు చేస్తున్నారు. ఇదే అదనుగా మంత్రాలయం, ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజక వర్గాల్లో కర్ణాటక, తెలంగాణ సరిహద్దు మండలాల్లోని గ్రామాల్లోని బెల్టు షాపుల్లో కర్ణాటక తయారీ, అక్రమ మద్యం (నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్-ఎన్‌డీపీఎల్) విక్రయాలు చేస్తున్నారు. జిల్లాలో సుమారుగా 2 వేలకు పైగా మద్యం బెల్టు దుకాణాలు ఉన్నాయని అనధికారిక సమాచారం. నవంబరు నెలలో అధికారికంగా రూ.75 కోట్ల విలువైన మద్యం 96,330 కేసుల లిక్కరు, 37,676 కేసుల బీరు విక్రయాలు జరిగాయి. అందులో బెల్టు షాపుల్లో ఒక్కటే రూ.25 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయని అంచనా వేస్తున్నారు. అంటే బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు ఏస్థాయిలో జరుగుతున్నాయో తెలుస్తుంది.

సీఎం చంద్రబాబు హెచ్చరికతో బెల్టుకు కళ్లెం పడేనా..?:

'మద్యం మాఫియాను అరికట్టి తక్కువ ధరకే నాణ్యమైన మద్యం అందుబాటులో ఉంచాం.. మద్యం వ్యాపారంలో ఇతరుల జోక్యాన్ని సహించను. బెల్టు షాపులు పెడితే నేను కూడా బెల్టు తీయాల్సి వస్తుంది..' అని అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం నేమకల్లు ప్రజావేదిక సభలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి హెచ్చరికతోనైనా టీడీపీ కూటమి నాయకుల్లో మార్పు వస్తుందా..? ఎక్సైజ్ అధికారుల్లో కదలిక వస్తుందా..? ఊరూవాడా విచ్చలవిడిగా వెలసిన మద్యం బెల్టు షాపులకు తాళం పడుతుందా..? అన్నది ప్రశ్నార్థకమే. కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి ముఖ్యమైన ప్రజాప్రతినిధులే జోక్యం చేసుకోవడంతో నిఘా అధికారులు కళ్లకు గంతలు కట్టుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నాయకుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని మద్యం వ్యాపారంతో ఎలాంటి సబంధం లేని అధికార కూటమి నాయకులే పేర్కొంటున్నారు.

బెల్టు షాపులపై నిఘా పెడుతున్నాం



గ్రామాల్లో బెల్టు షాపులపై నిఘా పెట్టాం. ఎక్సైజ్ స్థానిక, విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తున్నారు. నవంబరు నెలలో 66 బెల్టు షాపులపై కేసులు నమోదు చేసి 350 లీటర్ల ఐఎంఎల్ మద్యం సీజ్ చేసి 64 మందిని అరెస్ట్ చేశాం. మరో 70 కేసులు నమోదు చేసి కర్ణాటకలో తయారీ, అక్రమ ఎన్‌డీపీఎస్ మద్యం 934 లీటర్లు సీజ్ చేశాం. 23 నాటు సారా కేసులు నమోదు చేశాం. బెల్టు షాపులపై దాడులు చేసి నియంత్రిస్తాం. ఎవరినీ ఉపేక్షించేది లేదు.

- సుధీర్‌బాబు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, కర్నూలు

మల్లన్న సన్నిధిలో తెలంగాణ మంత్రి సీతక్క



ఆలయ ప్రాంగణంలో తెలంగాణ మంత్రి సీతక్క

శ్రీశైలం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం తెలంగాణ రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మంత్రి సీతక్కకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికారు. అనంతరం మంత్రి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో మంత్రి సీతక్కకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

వ్యవసాయ డ్రోన్..!

● అన్నదాతల సరికొత్త ప్రయోగం ● డ్రోన్‌తో మందులకు పిచికారీ ● ఆసక్తిగా తిలకిస్తున్న రైతులు



డ్రోన్‌లోకి పురుగుమందు, నీరు కలుపుతూ..

మద్దికెర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పహారాలో సైనికుడిలా.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులా.. భూముల కొలతలకు సర్వేయర్‌గా.. విపత్తులు సంభవించినప్పుడు సేవకుడిలా డ్రోన్ ఉపయోగపడుతుంది. ఇప్పుడు వ్యవసాయ పనుల్లో రైతుకూలిగా కూడా మారుతోంది. ఒకప్పుడు డ్రోన్ అంటే ఆశ్చర్యంగా చూశాం. తర్వాత డ్రోన్ సర్వాంతర్యామిగా మారిపోయింది. మొదట్లో ఏదో ఒక సందర్భంలోనే డ్రోన్‌ను వినియోగించేవారు. క్రమేణా వివాహాది శుభకార్యాలకు డ్రోన్ కెమెరా తప్పనిసరిగా మారింది. ఇప్పుడు డ్రోన్ విప్లవంలో మరో ముందడుగు పడింది. విదేశాల్లో మాత్రమే పంటలకు డ్రోన్‌ను వినియోగించేవారు.. ఇప్పుడు మారుమూల పల్లెల్లో సైతం పంటలకు డ్రోన్ ద్వారా పిచికారీ చేస్తున్నారు.

మద్దికెర మండలంలో దాదాపుగా 15 వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. కంది 5వేల ఎకరాల్లో, జొన్న 3వేల ఎకరాల్లో పంటలను సాగులో ఉంది. అయితే ఈ ఏడాది మంచి వర్షాలు కురవడంతో కంది పంట ఆరు నుంచి 7 అడుగుల ఎత్తు రాగా, జొన్న పంట 7 నుంచి 8 అడుగుల ఎత్తు రావడంతో తెగుళ్ల నివారణకు మందులు పిచికారి చేయడానికి ఇబ్బందులు పడుతుండేవారు. రైతులు ట్రాక్టరు ద్వారా మందు పిచికారీ చేస్తే పంటలు దెబ్బతింటాయనే ఆలోచనలో ఉండగా.. కొత్త ఆలోచనకు తెర తీశారు. అందులో భాగంగా డ్రోన్‌ను తెచ్చుకుని మందు పిచికారీ చేస్తున్నారు. ఎకరాకు రూ.400ల చొప్పున కూలీ ఇస్తూ మందులు పిచికారీ చేస్తున్నారు. అంతేగా తైవాన్ స్ప్రేయర్ ద్వారా మందులు పిచికారీ చేస్తే ఎకరాకు వెయ్యి లీటర్ల నీరు అవసరమవుతుంది. డ్రోన్‌తో అయితే కేవలం 10 నుంచి 15 లీటర్లు మాత్రమే అవసరమవుతోందని రైతులు తెలుపుతున్నారు. పంట ఏపుగా ఉండటం వల్ల మందు పిచికారీ చేయలేకపోతున్నారు. డ్రోన్‌కు చుట్టు ఆరువైపులా రెక్కలు ఉన్నాయి. నాలుగు రెక్కల ద్వారా మందులు పిచికారీ చేస్తున్నారు. దీంతో ప్రమాదం జరగకపోగా.. మందు పంట మొత్తానికి కలుస్తుందని తెలుపుతున్నారు. రైతుకు కూలీలు మిగలడమే కాకుండా నీరు కూడా ఆదా అవుతుందని అన్నారు. ఏది ఏమైనా రైతన్న పంట కోతకు యంత్రాలు ఎలా వాడుతున్నారో ఇప్పుడు పంటల పిచికారీ చేసేందుకు డ్రోన్‌ను వాడడం విశేషం. డ్రోన్‌తో పంటలు పిచికారీ చేయడాన్ని రైతులు ఆసక్తిగా తిలకించారు.



పంటల పిచికారీ చేస్తున్న డ్రోన్‌ను తిలకిస్తున్న రైతులు

సమయం ఆదా అవుతోంది



డ్రోన్‌తో పంటలపై మందులు పిచికారీ చేయడం వల్ల సమయంతో పాటు నీరు కూడా ఆదా అవుతోంది. అంతేకాకుండా ఎలాంటి ప్రమాదాలు కూడా జరగవు. పంటల పిచికారీకి డ్రోన్ ఎంతో ఉపయోగపడుతోంది. అసలు డ్రోన్‌తో పిచికారీ అంటే నమ్మలేకపోతున్నాం.

-హరిబాబు, రైతు

పెట్టుబడులు తగ్గాయి



సహజంగా ఎకరాకు కూలీలను ఏర్పాటు చేసి మందులు పిచికారీ చేస్తే దాదాపు రూ.600 ఖర్చు వస్తోంది. డ్రోన్ కెమెరాతో మందులు పిచికారీ చేయడం వల్ల పెట్టుబడి బాగా తగ్గుతుంది.

- మల్లికార్జున, మద్దికెర

డ్రోన్ వినియోగం మంచిదే..



డ్రోన్ ఉపయోగించడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం. ఈ ఏడాది పంటలు ఏపుగా పెరిగాయి. మందులు పిచికారీ చేసే రైతులకు డ్రోన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రతి ఒక్క రైతు ఉపయోగించుకోవాలి.

- ఉప్పర రవి, మండల వ్యవసాయాధికారి

మోసం చేయడం చంద్రబాబు నైజం

● మాజీ ఎమ్మెల్యే కాటసాని



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలను మోసం చేయడం సీఎం చంద్రబాబునాయుడు నైజమని, విద్యుత్ చార్జీలు పెంచి ఆ పేరును మరొకమారు నిరూపించుకున్నారని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం నగరంలోని చెన్నమ్మకూడలిలోని తన స్వగృహంలో ఆయన సమావేశం నిర్వహించి టీడీపీ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎన్నికల ముందు ప్రతిపక్ష నేతగా విద్యుత్ చార్జీలు ఎట్టి పరిస్థితుల్లో పెంచబోమని, వైసీపీ పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గిస్తానని ప్రజలకు బహిరంగసభల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 6 నెలల్లో రెండు సార్లు ట్రూ అప్ చార్జీల పేరిట రూ.15485కోట్ల భారాన్ని మోపిందన్నారు. ప్రజలకు వైసీపీ అండగా ఉంటుందని, కూటమి ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, విద్యుత్ చార్జీల తగ్గింపు కోసం పోరాడతామని చెప్పారు. డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక, కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నాగలక్ష్మీరెడ్డి, నారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, శివశంకర్‌రెడ్డి, సానా శ్రీనివాసులు, నరసింహులు ఉన్నారు.

పోలీసుల అదుపులో వెలుగోడు ఎంపీపీ

వెలుగోడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం నిల్వ, అక్రమ తరలింపు వ్యవహారంలో వైసీపీ నాయకుడు, వెలుగోడు ఎంపీపీ లాలం రమేష్‌ను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్టోబరు 8న ఎంపీపీకి రమేష్‌కు చెందిన జగదాంబ రైస్‌మిల్లులో పోలీసులు, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు 20 ప్యాకెట్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. ఈ విషయంపై లాలం రమేష్‌ను ఆత్మకూరు సీఐ సురేష్ కుమార్ రెడ్డి, వెలుగోడు ఎస్ఐ విష్ణునారాయణలు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎంపీపీ లాలం రమేష్‌పై గతంలో కూడా ఏడు కేసులు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఆయనను విచారిస్తున్నామని, విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దుర్గాభోగేశ్వర ఆలయంలో న్యాయాధికారి పూజలు



దుర్గాభోగేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ సిబ్బంది

గడివేముల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస చివరి రోజు పురస్కరించుకొని ఆదివారం మండంలోని దుర్గాభోగేశ్వర ఆలయంలో దుర్గాభోగేశ్వరస్వామిని నంద్యాల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి రాధారాణి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ, ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దుర్గాభోగేశ్వరుడికి ఆమె పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం న్యాయాధికారికి అర్చకులు శాలువా కప్పి దుర్గాభోగేశ్వరుడిని చిత్రపటాన్ని అందజేశారు.

ఓపెన్ డ్రింకింగ్‌పై డ్రోన్ నిఘా

18 కేసులు నమోదు

కర్నూలు క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం(ఓపెన్ డ్రింకింగ్) సేవిస్తున్న వారిపై పోలీసులు డ్రోన్‌తో నిఘా ఉంచారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు కర్నూలు నగరంలోని పలు ప్రాంతాల్లో నాలుగో పట్టణ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా డ్రోన్ కెమెరాలతో తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, నాలుగో పట్టణ ఎస్ఐ గోపినాథ్, ఆర్ఎస్ఐ హుసేన్‌లు చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా, డీమార్ట్ వెనుక ప్రాంతాల్లో ఈ తనిఖీలు చేశారు. చెన్నమ్మ సర్కిల్ వద్ద ఏడుగురిని, కల్లూరు వక్కిలేరి వాగు వద్ద 11 మంది, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ మన్సూరుద్దీన్ వెల్లడించారు.

భక్తులపై తేనేటీగల దాడి

నలుగురికి గాయాలు



తేనేటీగల దాడిలో గాయపడిన వృద్ధురాలు పెద్దక్క

బేతంచెర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారులోని కొలుములపల్లె రస్తాలో వెలసిన అంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులపై తేనేటీగల దాడి చేశాయి. ఆదివారం కార్తీకమాసం చివరిరోజు అమావాస్య కావడంతో అంజనేయస్వామిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పరిసరాల్లో వృద్ధురాలు పెద్దక్క, మహేష్‌గౌడ్, మరో ఇద్దరు భక్తులపై తేనేటీగలు దాడి చేయగా.. అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆలయ నిర్వాహకులు అస్వస్థతకు గురైన భక్తులను వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పొలంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

మంత్రాలయం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో రచ్చుమర్రి గ్రామానికి కిలో మీటరు దూరంలో చాకలి రామచంద్ర రైతు పత్తి పొలంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఆదివారం పొలంలోకి కూలీలు పత్తి తీసేందుకు వెళ్లిన కూలీలు దుర్వాసన రావడతో పరిశీలించా మహిళ మృతదేహం కనిపించింది. దీంతో మాధవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ విజయకుమార్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. 15 రోజుల క్రితం మహిళ మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి వయసు దాదాపు 40 నుంచి 45ఏళ్ల వరకు ఉండవచ్చని తెలిపారు. గుర్తు పట్టలేనంతగా శరీరం కుళ్లిపోయింది. మహిళ వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని మహిళ మృతదేహంగా కేసు నమోదు చేసి ఆదోనికి చెందిన డా.షాహీల్ అక్కడే పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్లు.. నిబంధనలకు చెల్లు..!

(5 వ పేజీ తరువాయి)

ఇంటి నిర్మాణదారులు అనుమతులు కోసం దరఖాస్తు చేసుకోవాలంటే ముందుగా ఇంటికి సంబంధించి ప్లాన్‌ను మున్సిపాలిటీ వారికి సమర్పించాల్సి ఉంటుంది. దీనికి సంబంధిత మున్సిపాలిటీ నుంచి లైసెన్స్ పొందిన ఇంజనీరు ద్వారా ప్లాన్ గీయించాల్సి ఉంటుంది. ఈ ప్లాన్ అందించేవారిని ఎల్‌టీపీ (లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్) అంటారు. ఏదైనా ఓ వార్డులో ఇంటి నిర్మాణం చేపట్టిన సంబంధిత యజమాని ఎల్‌టీపీలను సంప్రదించగానే ఆ వార్డు సచివాలయానికి ప్లాన్ పంపిస్తారు. దీనిని సదరు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ పరిశీలించి మునిసిపల్ అధికారులకు పంపుతారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు, కొంతమంది ఎల్‌టీపీలు కుమ్మక్కై నంద్యాల పట్టణంలోని వార్డుల్లో నిబంధనలు సరిగా పాటించకుండా ఇంటి నిర్మాణం చేపట్టాలనుకునే వారి దరఖాస్తులు ఓ వార్డు సచివాలయానికి వెళ్లేలా పథకం పన్నినట్లు తెలుస్తోంది. సదరు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ దరఖాస్తులను పై అధికారులకు పంపించకుండా నిలిపివేస్తున్నాడని సమాచారం. అవి 15 రోజుల తర్వాత డీమ్డ్ కిందకు రావటం, మున్సిపాలిటీ నుంచి అనుమతులు రాకుండానే సదరు యజమానులు ఇంటి నిర్మాణాలను చేపడుతున్నారు. ఇలా అధికారులు, ఎల్‌టీపీలు, సచివాలయ సిబ్బంది అందరూ కలిసి అక్రమ నిర్మాణదారులకు వంత పాడుతున్నారని, సదరు వార్డు ప్లానింగ్ సెక్రటరీ లాగిన్ ఓ సారి పరిశీలిస్తే విషయమంతా బట్టబయలవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

వివరాలు తెలియవా.. లేక దాచిపెడుతున్నారా?

నంద్యాల మున్సిపాలిటీ విభాగానికి వెళ్లి తమ ఇంటి నిర్మాణ అనుమతి దరఖాస్తు గురించి తెలుసుకోవాలంటే చుక్కలు చూడాల్సిందే! డబ్బులు ముట్టజెప్పారా.. అసలు మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లకుండానే అనుమతులు వచ్చేస్తాయి. లేదంటే.. 'దరఖాస్తు తాజా పరిస్థితి ఇంటర్నెట్‌లో చూసుకోండి' అని అధికారులు తాపీగా సమాధానమిస్తారు. అసలు పట్టణంలో అనుమతులు లేని నిర్మాణాలు ఎన్ని ఉన్నాయి? షాట్‌ఫాల్ దరఖాస్తులు ఎన్ని ఉన్నాయి? డీమ్డ్ దరఖాస్తులు ఎన్ని ఉన్నాయి? అని అడిగితే సైట్ తెరుచుకోనప్పుడు తమకు మాత్రం ఎలా తెలుస్తుందని దురుసుగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులకే సైటు తెరుచుకోనప్పుడు సామాన్యులకు ఎలా తెలుస్తుందన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయాన్ని కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు అడిగినా అధికారులు అనుమతులు లేని నిర్మాణాలు, షాట్‌ఫాల్, డీమ్డ్ దరఖాస్తుల వివరాలు తెలియవని చెబుతుండటం గమనార్హం. పట్టణంలోని ప్రతి ఇంటి నిర్మాణానికి సంబంధించిన వివరాలు అధికారులు, సిబ్బంది వద్ద ఉన్నాయని, కానీ అసలు విషయాన్ని బయటపెడితే తమ వ్యవహారం బయట పడుతుందన్న ఉద్దేశంతో వివరాలను దాచిపెడుతూ అక్రమ నిర్మాణదారులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతి కంపు



నంద్యాల పట్టణంలో డీమ్డ్ దరఖాస్తులు దాదాపు 260కి పైగా ఉన్నాయి. కావాలనే అనుమతులు ఆలస్యం చేస్తూ వీటిని డీమ్డ్ కిందకు వచ్చేలా చేస్తున్నారు. ఈ తతంగమంతా మున్సిపాలిటీ అధికారులు, ఎల్‌టీపీ, ఓ వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ చేస్తున్నాడు. డీమ్డ్ కింద ఉన్న దరఖాస్తుదారులు ఇళ్లు కట్టుకుంటున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. సదరు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ లాగిన్ ఓ సారి పరిశీలిస్తే అసలు విషయాలు బయటపడతాయి. డబ్బులు ఇచ్చుకోలేని వారి దరఖాస్తులను షాట్‌ఫాల్ అంటూ వెనక్కు పంపుతున్నారు. ఇలాంటివి పట్టణంలో దాదాపు 200 వరకు ఉన్నాయి. నంద్యాల మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతి కంపు కొడుతోంది. సంబంధిత విభాగాన్ని ఉన్నతాధికారులు పరిశీలిస్తే అవినీతిపరులు బండారం బయటపడుతుంది.

- మాబువలీ, నంద్యాల మున్సిపాలిటీ టీడీపీ ఫ్లోర్ లీడర్.

గోనెగండ్ల మోడల్ స్కూల్‌లో విద్యార్థికి పాముకాటు

ఆసుపత్రిలో చికిత్స

గోనెగండ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ విద్యార్థి పాము కాటుకు గురయ్యాడు. అయితే ఈ ఘటన శనివారం జరిగినప్పటికీ ఉపాధ్యాయులు, సిబ్బంది సమాచారాన్ని గోప్యంగా ఉంచేందుకు యత్నించడంతో ఒకరోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని పెద్దనేలటూరు గ్రామానికి చెందిన దస్తగిరి కుమారుడు మాలిక్ బాషా గోనెగండ్ల మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ బైసీపీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పెద్దనేలటూరు నుంచి గోనెగండ్ల మోడల్‌స్కూల్‌కు వస్తూ ఉండేవాడు. శనివారం ఉదయం పాఠశాలలో ప్రార్థన ముగించుకుని తరగతి గదిలోకి వెళ్లాడు. అక్కడే టేబుల్ పక్కన ఉన్న పాము మాలిక్ బాషా కాలికి కాటు వేసింది. సమాచారం తెలుసుకున్న సిబ్బంది విద్యార్థిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎంఈవో రామాంజ నేయులు ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. డీఈఓ శ్యామ్యూల్ పాల్ విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై ఎంఈవోతో ఆరా తీశారు. ప్రస్తుతం విద్యార్థి మాలిక్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ఈ విషయంపై ఎంఈవో మాట్లాడుతూ పాఠశాలలో పిచ్చిమొక్కలు, అపరిశుభ్రత ఉండటం వల్ల విషపురుగులు తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. వెంటనే పాఠశాలలో పారిశుధ్య చర్యలు చేపడతామన్నారు.

జిల్లా వ్యాప్తంగా కార్డెన్ సెర్చ్

31 బైక్‌లు స్వాధీనం, కేసులు నమోదు



నాటుసారా బట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు తెల్లవారుజాము నుంచి పోలీసు అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో 31 బైక్‌లను స్వాధీనం చేసుకుని పలువురిపై కేసు నమోదు చేశారు. అవుకు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండమనా యునిపల్లె, సంజామల పరిధిలోని ఆల్వకొండ గ్రామం, పాణ్యం మండలం సుగాలిమెట్ట, వెలుగోడు పోలీస్ స్టేషన్ పరిధిలోని రేగడగూడూరు గ్రామంలో ఏకకాలంలో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించి సరైన ధ్రువపత్రాల్లేని 31 బైక్‌లు, 300 కిలోల బెల్లం, 80 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఆయా గ్రామాల్లోని నేరచరిత్ర గలవారికి, రౌడీషీటర్లు, సస్పెక్ట్‌లకు గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు, గొడవలకు పాల్పడకుండా ఐకమత్యంతో సత్ప్రవర్తన కలిగి జీవించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఐదుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, వందమంది పోలీసు సిబ్బంది, క్యూఆర్టీ పోలీసులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డా.ఎస్.నాగస్వామి నాయక్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఎయిడ్స్ వ్యాధిపై ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్ మనుషుల్లో చేరిన వెంటనే రోగ నిరోధక శక్తిని దెబ్బతీస్తుందని, తద్వారా జలుబు, గొంతునొప్పి, జ్వరం వంటి అంటురోగాల బారిన పడుతారని తెలిపారు. ఈ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీ కళాశాల నుంచి సీ.క్యాంపు మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రామకృష్ణ, మల్లికార్జున, సోమేష్, సుజాత, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని రాయలసీమ యూనివర్సిటీ ఇంచార్జీ ఉపకులపతి, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో క్యాంపస్ నుంచి బీ. తాండ్ర పాడు వరకు విద్యార్థుల నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలోఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కే. వెంకటరత్నం, నాగచంద్రుడు, శివప్రసాదరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీని వైస్ ప్రిన్సిపాల్ జె. హేమంత్ ప్రారంభించారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనరు బి. సుజాత, ఆర్ కామ్లీ నాయక్ జి. నాగేశ్వర్‌రావు, ఎస్ షాజిదాబీ, ఆధ్యాపకులు, ఆధ్యాపకేతరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

కర్నూల న్యూసిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో 4న జరిగే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.నాగరాజు, జిల్లా నాయకులు ఎస్.నాగార్జున పిలుపునిచ్చారు. ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో కార్యలయంలో ప్రజా హక్కుల సభ గోడపత్రికలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అందించే సూపర్ సిక్స్ పథకాలు కాదు.. ప్రజలు కోరే పీపుల్ సిక్స్ సాధిద్దామంటూ పిలుపునిచ్చారు. తెలుగునేల నుంచి మతతత్వ రాజకీయాలను తరిమివేద్దాం అని అన్నారు. విజయవాడలో జింఖానా గ్రౌండులో జరిగే బహిరంగ సభ, ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏలియా, మునిస్వామి, రాజు, లింగన్న, పాల్గొన్నారు.

కుడా చైర్మన్ సోమిశెట్టికి సన్మానం



సోమిశెట్టిని సన్మానించిన బలిజ సంఘం నాయకులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సోమిశెట్టి వెంకటేశ్వర్లును బలిజ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఆదివారం సోమిశెట్టి నివాసంలో కలిసిన నగర బలిజ సంఘం గౌరవ అధ్యక్షులు పత్తి ఓబులయ్య, డాక్టర్ సింఘం శెట్టి సోమశేఖర్‌ల ఆధ్వర్యంలో శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జి. లక్ష్మన్న, మండ్లేం రవి. సైలేష్. సహదేవుడు, సుజాత, ఈశ్వర్ రాయల్, వాసు రాయల్, శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు.

26న ఓపెన్ కబడ్డీ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ సందర్భంగా పంచలింగాల ఏబీఎం చర్చి ఆధ్వర్యంలో 26, 27 తేదీల్లో పురుషుల ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు చర్చి పెద్దలు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.60వేలు, రూ.40వేలు, రూ.20వేలు, రూ.10వేలు బహుమతులు ఇవ్వనున్నట్లు పుల్లన్న తెలిపారు. వివరాల కోసం 9441657657, 9704343454లను సంప్రదించాలన్నారు.

'హామీలు వెంటనే అమలు చేయాలి'

కర్నూల న్యూసిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే.శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్నలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక స్వామిరెడ్డినగర్, బంగారుపేటలో జరిగిన ఏఐవైఎఫ్ శాఖ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలపైన శ్వేతపత్రం విడుదల చేసి వాటి భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కృష్ణ, నాగరాజు, కుమార్, రాజశేఖర్, శివాజీ, విన్నీ, శ్రీనివాసులు, రాజ్‌కుమార్, బాబ్జీ పాల్గొన్నారు.

మొత్తం పరిహారం చెల్లించాల్సిందే

రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2021 ఖరీఫ్‌లో ఓ కంపెనీకి చెందిన నాసిరకం విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, మొత్తం రూ.23 కోట్ల నష్టపరిహారాన్ని కంపెనీ నుంచి చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని రైతు సంఘం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.23 కోట్ల నష్టపరిహారంలో కోత పెట్టి రైతులకు అన్యాయం చేసేలా అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసిందని, అదే జరిగితే.. రైతులను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఉమ్మడి జిల్లాలో 17 మండలాల్లో 7,255 ఎకరాల్లో ఓ కంపెనీకి చెందిన విత్తనాలను పొలాల్లో నాటుకుని రైతులు నష్టపోయారని, వారికి కచ్చితంగా నష్టపరిహారం చెల్లించాల్సిందేనని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి 2021లోనే ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. పరిహారంలో కోత అంగీకరించబోమని, మొత్తం పరిహారం చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు.

గ్రామాలకు మంచి రోజులు

డబ్బులు లేమి నుంచి ఇప్పుడిప్పుడే ఊరట పొందుతున్న గ్రామ పంచాయతీలకు మరింత ఉపశమనం లభించనుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చొరవతో.. కేంద్రం జిల్లా పరిధిలోని గ్రామ పంచాయతీలకు 2024-25 ఆర్థిక సంవత్సరానికి తొలి విడత 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. అందులో భాగంగా ఓర్వకల్లు మండలానికి మొత్తం 22 పంచాయతీలకు గాను రూ. 1.33 కోట్లు మంజూరయ్యాయి. గతనెల 14న జిల్లా కేంద్రానికి ఆదేశాలు అందాయి. ఆ నిధుల్లో అన్‌టైడ్ గ్రాంటు కింద రూ. 53,48,078, టైడ్ గ్రాంటు కింద 80,22,120.. మొత్తంగా 1,33,70,198 వరకు నిధులు ఉన్నాయి.

ఓర్వకల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి)

రూ.1.33 కోట్ల ఆర్థిక సంఘం నిధులు విడుదల





మండల వ్యాప్తంగా 80 శాతం గ్రామ పంచాయలతీలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా.. త్వరలో వాటికి ఉపశమనం కలుగనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు సర్పంచులు వడ్డీలకు అప్పులు తెచ్చి మరీ ఖర్చు చేసి.. బిల్లులు రాక లబోదిబోమనేవారు. నాడు కేంద్రం నుంచి విడుదలైన నిధులను సైతం విద్యుత్ బకాయిల పేరిట మినహాయించుకోవడం ఇక్కట్లను జటిలం చేశాయి. పంచాయతీరాజ్ చట్టాన్ని జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. పంచాయతీల పట్ల బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించి స్వపరిపాలన, సుపరిపాలనకు చోటు లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ అంశం పై ప్రత్యేక దృష్టి సారించి పాత బకాయిలన్నీ రెండు దఫాలుగా విడుదల చేయించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో పాటు గ్రామీణ వ్యవస్థలను బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతోంది.

నేరుగా ఖాతాలకే: ప్రస్తుతం విడుదల చేసిన నిధులను కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన నేరుగా ఆయా గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమచేయనుంది. ఈ నిధుల్లో 60 శాతం టైడ్ నిధులుగా, 40 శాతం నిధులు అన్‌టైడ్ గ్రాంటు కింద విడుదల చేశారు.

60 శాతం టైడ్ గ్రాంటుతో పనులు: టైడ్ గ్రాంటు కింద విడుదలైన 60 శాతం నిధులతో ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగు నీటి సరఫరా, గ్రామ సభల నిర్వహణ, రహదారులు, ఇతర సేవలకు ఈ నిధులను ఖర్చు చేసుకునేందుకు ప్రభుత్వం వెసలుబాటు కల్పించింది. అదే విధంగా అన్‌టైడ్ గ్రాంటుగా విడుదల చేసిన రూ. 53.48 లక్షల్లో పది శాతం విద్యుత్ బకాయిలకు కచ్చితంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మిగిలిన నిధులను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలు, అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో అభివృద్ధి పనులకు ఖర్చు చేసుకోవచ్చు.

పంచాయతీలపై ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావన : ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పంచాయితీల నిర్వహణపై ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్పంచులకు నిధులు లేక అభివృద్ధి పనులు జరగలేదని, వచ్చిన నిధులను జగన్ ప్రభుత్వం తమ ఖాతాల్లో వేసుకోవడం జరిగిందని అసెంబ్లీలో గళం విప్పారు. స్పందించిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మంజూరు చేసిన నిధులను నేరుగా పంచాయితీల ఖాతాల్లోనే జమ చేయడం జరిగింది. దీంతో ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి పలువురు సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు.

అప్పులు చేసి అభివృద్ధి పనులు చేశా



గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు నిధులు కేటాయించక పోవడంతో రూ. 15 లక్షల మేర అప్పులు చేసి గ్రామంలో పైపు లైన్, జీత భత్యాలు, సీసీ రోడ్లు, వీధి లైట్లు, పారిశుధ్యం తదితర అభివృద్ధి పనులు చేశా. గత ప్రభుత్వంలో సర్పంచులు మూకుమ్మడిగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా నిధులు విడుదల చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే నిధులను మంజూరు చేయడం శుభ పరిణామం.

- నర్ల మోహన్‌రెడ్డి, సర్పంచు, గుట్టపాడు

మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం



వైసీపీ ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేయకుండా వేరే అవసరాలకు మళ్లించుకుంది. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామ స్వరాజ్యం.. అభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు కృషి చేసి నిధులు విడుదల చేయడం హర్షణీయం.

- చదువుల సుజాతమ్మ, సర్పంచ్, పాలకొలను

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు



వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల కొరతతో పంచాయితీలు అభివృద్ధికి నోచుకోలేదు. రాష్ట్రంలో పల్లెల ప్రగతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఉపాధి పథకం ద్వారా మండలంలోని గ్రామ పంచాయితీల అభివృద్ధికి రూ. 2కోట్లు నిధులు కేటాయించడం సంతోషదాయకం.

- చంద్ర గోవర్ధనమ్మ, సర్పంచ్, హుస్సేనాపురం

మౌలిక వసతుల పనుల వేగం పెంచాలి

● నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు



కల్వర్టును పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూల న్యూసిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన అభివృద్ధి పనులను జాప్యం లేకుండా వేగవంతం చేయాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులకు ఆదేశించారు. ఆదివారం జోహరాపురంలోని అశ్వినిహాస్పిటల్ సమీపంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, కల్వర్టు, రిటైనింగ్‌వాల్‌ను ఆయన పరిశీలించారు. అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. ఆయన వెంట ట్రైనీ రామ్మోహన్ పాల్గొన్నారు.

'ఉద్యోగావకాశాలు కల్పించండి'



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రైల్వే వ్యాగిన్‌ను వెంటనే పూర్తి చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శి ప్రకాస్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ పంచలింగాల సమీపంలో రైల్వే వ్యాగిన్ నిర్మాణం చేసి మండలంలోని యువతకు, ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి పది సంవత్సరాలు అవుతుందన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా నత్తనడకన నడుస్తున్న కర్నూలు రైల్వే వ్యాగిన్ ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వెంటనే కర్నూలు రైల్వే వ్యాగిన్ పూర్తి చేసి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో మండల నాయకులు సురేష్, హరికిషన్ రెడ్డి, వై.శంకర్, దివాకర్, నాగప్ప, రాజు, సభ్యులు ఎన్.రాజు, రాము, దస్తగిరి మహేష్, అంజి, హరి పాల్గొన్నారు.

'కర్నూలుకు హైకోర్టు బెంచ్ కోసం టీజీ భరత్ కృషి'

కర్నూలు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు హైకోర్టు బెంచ్ కోసం టీజీ భరత్ ఎంతో కృషి చేశారని బీసీ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి టి. సాయిబాబ అన్నారు. ఆదివారం నగరంలోని పాతబస్టాండ్ లోని అంబేడ్కర్ విగ్రహంకు పూలమాలలు వేసి, కర్నూలు హక్కు హైకోర్టు బెంచ్ అంటూ నినాదాలు చేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల కమిషన్, లోకాయుక్త లాంటి రాష్ట్ర కార్యాలయాలు కర్నూల్లోనే కొనసాగించేందుకు మంత్రి టీజీ భరత్ కృషి చేశారని కొనియాడారు.

తైక్వాండోతో విద్యార్థులకు ఆత్మవిశ్వాసం

● పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత



తైక్వాండోలో శిక్షణ పొందిన విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత

కల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో శిక్షణతో పిల్లలు, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. ఆదివారం నగరంలోని సప్తగిరినగర్‌లో చంద్ర నాగేశ్వరరావు భవన్‌లో తైక్వాండో శిక్షణ తీసుకుంటున్న పిల్లలకు కలర్‌బెల్ట్‌ల ప్రధానోత్సవానికి ఆమె ముఖ్య అతిధిగా హాజరయ్యారు. సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, 19వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ ప్రభాకర్‌యాదవ్ పాల్గొన్నారు. గౌరుచరిత మాట్లాడుతూ సమాజంలో కార్పొరేట్ వ్యవస్థ రాకతో పిల్లలకు క్రీడలపై ఆసక్తి తగ్గిందని, కేవలం చదువులు, ర్యాంకుల మోజులో వారిలోని నైపుణ్యం బయటికి రావడం లేదన్నారు. క్రీడలు, తైక్వాండో లాంటి శిక్షణతో విద్యార్థులు, పిల్లల్లో ఏకాగ్రత, దేహదారుఢ్యం, ఆరోగ్యం పెంపొందుతాయన్నారు. అనంతరం తైక్వాండోలో శిక్షణ పొందిన పిల్లలకు ఎమ్మెల్యే బెల్టుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో తైక్వాండో మాస్టర్ హుస్సేన్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ జీవనశైలితో సంపూర్ణ ఆరోగ్యం

- ఆర్ఎస్ఎస్ ఏపీ ప్రాంత కుటుంబ ప్రబోధన ప్రముఖ్ పుట్టా శేషు



మాట్లాడుతున్న పుట్టా శేషు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవనశైలిని మార్చుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఆర్ఎస్ఎస్ ఏపీ ప్రాంత కుటుంబ ప్రబోధన ప్రముఖ్ పుట్టా శేషు అన్నారు. ఆదివారం రాత్రి నగరంలోని వీఆర్ కాలనీలోని లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం కల్యాణ మంటపంలో, ధన్వంతరి జయంతి వారోత్సవాల్లో భాగంగా, ఆరోగ్యభారతి ఆధ్వర్యంలో ఆరోగ్య భారతి కుటుంబ సమ్మేళనం, వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ఎల్ భాస్కర్, ఆరోగ్యభారతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ పి. మోక్షేశ్వరుడు, బి. సత్యనారాయణ రెడ్డి, ఆరోగ్యభారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీనియర్ వైద్యాధికారి డాక్టర్ డి. ప్రభాకర్ రెడ్డి, ఆరోగ్యభారతి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎండీవీఎస్ రామశర్మ హాజరయ్యారు. పుట్టా శేషు 'మన ఆహారమే మన ఆరోగ్యం' అనే అంశంపై మాట్లాడుతూ మన ఆరోగ్యం మనచేతుల్లోనే, మన చేతల్లోనే ఉందని చెప్పారు. ఉదయం నుంచి రాత్రి వరకు జీవన చక్రంలో నిర్వహిస్తున్న అంశాలన్నీ విభిన్నంగా నిర్వహిస్తున్నందునే అనేక మంది జీవితంలో రుగ్మతలు, వ్యాధులు తలెత్తుతున్నాయని అన్నారు. జీవన శైలిని మార్చుకొని క్రమశిక్షణతో కూడిన ఆహార నియమాలు, శారీరక వ్యాయామాలు పాటించడం ద్వారా మంచి ఆరోగ్యానికి మార్గాలు ఏర్పరచుకోవచ్చని చెప్పారు. డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ ఎల్ భాస్కర్ మాట్లాడుతూ ఆరోగ్య భారతి సంస్థ ఆర్యోగవంతమైన సమాజాన్ని ఆవిష్కరించడంలో చేస్తున్న కృషి ప్రశంసనీయమని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య భారతి నగర అధ్యక్షుడు డాక్టర్ ఎస్ వెంకటరమణ, ఉపాధ్యక్షులు ఎస్ క్రిష్ణవేణమ్మ, నగర సంఘటన కార్యదర్శి ఎం భరత్‌కుమార్‌రెడ్డి, ఆరోగ్య మిత్రలు రమాపరభ, బి. మహేశ్, శేఖర్‌గుప్త పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



మాట్లాడుతున్న మల్లు రఘునాథరెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్న మధ్యంతర భృతిని ప్రకటించి జీవోను 117ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఎస్. గోకారి, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన 78వ వార్షిక సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ మెరుగైన పీఆర్‌సీ ఇస్తామని మేనిఫెస్టోలో తెలిపారని, 12వ పీఆర్‌సీ అమలు చేయాల్సిన గడువు పూర్తయి 17 నెల లు ఆలస్యమైందన్నారు. వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించి పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు రూ.21వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, చెల్లింపులకు సంబంధించిన కార్యచరణ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోధనేతర కార్యక్రమాల భారం తగ్గిస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో చూపడం లేదన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు మెమో.నెం.57 మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాల్సి ఉండగా.. ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. పురపాలక పాఠశాలలో ఎస్‌జీటీ సమానమైన పోస్టులను వెంటనే ఉన్నతీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా ప్రధాన కార్యదర్శి టీకే జనార్దన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగరాజు, వెంకటేశ్వర్లు, సుంకన్న, సీనియర్ నాయకులు, మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, కమిటీ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్‌ను ప్రకటించాలి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టె కృష్ణయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధిమూర్తి కోరారు. ఆదివారం స్థానిక పీఆర్‌టీయు కార్యాలయంలో పీఆర్‌టీయు జిల్లా కౌన్సిల్ సమావేశం ఎన్‌వీ కృష్ణారెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న అంశాలను క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పీఆర్‌టీయు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడుగా ఎస్‌వీ కృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధనుంజయను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా వి.కృష్ణారెడ్డి, ఎల్. నాగమల్లేశ్వరరెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అందరూ రక్తదానం చేయాలి

● కర్నూలు కేఫ్ ఆధ్వర్యంలో రక్త దానం



రక్త దాతలకు సర్టిఫికెట్లు అందిస్తున్న రెడ్ క్రాస్ చైర్మన్

కర్నూలు అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అందరూ రక్తదానం చేయాలని రెడ్ క్రాస్ చైర్మన్ కేజీ గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని రెడ్ క్రాస్ క్యాంపస్‌లో నగరంలోని తలసేమీమా బాధితుల కోసం కర్నూలు కేఫ్ అధినేత ముక్కమల్ల మురళీమోహన్ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 60 యూనిట్స్ రక్తాన్ని దానం చేసిన యువతను అభినందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సెక్రటరీ శ్రీనివాసులు, రోపా అధ్యక్షులు చింతలపల్లి రామకృష్ణ, రాయలసీమ విద్యార్థి జేఏసీ చైర్మన్ కోనేటి వెంకటేశ్వర్లు, మానవతా స్వచ్ఛంద సంస్థ సేవా నగర అధ్యక్షులు శోభన్‌బాబు, గన్నపురెడ్డి, శ్రీనివాసరావు, చంద్ర మోహన్, వడ్ల శ్రీకాంత్, బి. శ్రీరాములు పాల్గొన్నారు.

భక్తులతో ఆలయాలు కిటకిట



భక్తుడి సన్మానిస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. కార్తీక మాసం పురస్కరించుకుని ఆదివారం అమావాస్య పర్వదినం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మండలంలోని కొమ్ము చెరువు ఆంజనేయ స్వామి, కాల్వ, భైరాపురంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు భక్తులు తరలివచ్చి స్వామివారికి ఆకుపూజలు, కుంకుమార్చన పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలోని కాల్వ గ్రామంలో ఉన్న కోనేటి ఆంజనేయస్వామిని టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, స్వామివారిని దర్శించుకుని భక్తులను సన్మానించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వామివారికి ఆకుపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వర స్వామికి భక్తులు అభిషేకాది పూజలు, అమ్మవారికి కుంకుమార్చన పూజలు చేశారు.

కల్లూరు: కార్తీక అమావాస్యను పురస్కరించుకుని శ్రీగోడల హనుమంతరాయస్వామి, సూర్య నారాయణస్వామి ఆలయంలో అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో స్వామివారికి చేపట్టిన విశేష పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం భక్తులు అర్చనలు, అభిషేకాలు, ఆకుపూజ, సింధూర పూజలను చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టి సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం, పల్లకీసేవ వైభవంగా నిర్వహించారు.



కాల్వలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కోడుమూరు రూరల్: మండలంలో వివిధ గ్రామాల్లో కార్తీక అమావాస్య పూజలు వైభవంగా జరిగాయి. ముఖ్యంగా ప్యాలకుర్తి భీమలింగేశ్వరస్వామి, వర్కూరు సిద్ధేశ్వరస్వామి, లద్దగిరి రామలింగేశ్వరస్వామి, గోరంట్ల లక్ష్మీమాధవ స్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. పంచామృతాభిషేకం, బిల్వ, పుష్పార్చన జరిపించారు. ప్యాలకుర్తిలో అన్నదానం చేసి సాయంత్రం ఉత్సవ మూర్తులకు మేళతాళాల మధ్యన పల్లకిసేవ నిర్వహించారు.

● **గిడ్డాంజనేయస్వామి సన్నిధిలో భజన:** మండలంలోని వెంకటగిరి గిడ్డాంజనేయస్వామి ఆలయంలో కార్తీక అమావాస్య పురస్కరించుకుని రాష్ట్రస్థాయి భజన పోటీలు చేపట్టారు. పోటీలో జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు అనంతపురం, నంద్యాల జిల్లాల నుంచి 32 భజన బృందాలు హాజరయ్యాయి. భజన పోటీని తిలకించడానికి గ్రామ ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. గిడ్డాంజనేయస్వామికి అభిషేకం, ఆకుపూజ వంటి విశేష పూజలు చేశారు.



వెంకటగిరిలో భజనలో పాల్గొన్న భజన బృందం

తాగునీటి సమస్యలకు హెల్ప్‌డెస్క్

ఆదోని టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి పురపాలక కార్యాలయంలో ఆదివారం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పార్థసారధి ఆదేశాల మేరకు ఏర్పాటు చేశామని, ప్రజలు 8977766407 నంబర్లో సంప్రదించాలని బీజేపీ అసెంబ్లీకో కన్వీనర్ నాగరాజు గౌడ్ తెలిపారు. 24 గంటలు అందుబాటులో ఉంటుందని, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

అదుపు తప్పిన బైక్..

పత్తికొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ - ఆదోని రహదారిలో ఆదివారం బైకు అదుపుతప్పడంతో ఇరువురు గాయపడ్డారు. వివరాలు.. పత్తికొండ మండలం నలకదొడ్డి గ్రామానికి చెదిన లక్ష్మన్న, రాముడు బైక్‌పై పత్తికొండకు పనినిమిత్తం వచ్చారు. తిరిగి గ్రామానికి వెళుతూ రహదారిపై గుంతలను చూసుకోలేకపో వడంతో బైక్ అదుపుతప్పి పడిపోయారు. లక్ష్మన్న కాలికి తీవ్ర గాయాలుకాగా, రాముడు తలకు గాయాలయ్యాయి. వీరిని పత్తికొండ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

సభ్యత్వంతో భరోసా



సభ్యత్వం నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా వస్తుందని ఎంపీటీసీ భర్త కొత్తపల్లి రంగస్వామి, సోషల్ మీడియా కన్వీనర్ హుశేన్‌పీరా అన్నారు. ఆదివారం కొత్తపల్లి గ్రామంలో సభ్యత్వ నమోదును ప్రారంభించారు. రూ.వంద చెల్లించి సభ్యత్వం తీసుకుంటే కుటుంబానికి బీమా పరిహారం అందుతుం దన్నారు. ఎమ్మెల్యే శ్యాంబాబు ఆదేశాల మేరకు ఇంటింటా సభ్యత్వ నమోదును చేస్తున్నామన్నారు. చంద్ర, సలీం, రవి, బాషా పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

వెల్దుర్తి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు తరలిరావాలని ఎస్ఎస్ఎఫ్ సమరసత ఫౌండేషన్ కన్వీనర్ నరహరికృష్ణ, ఆర్యవైశ్య చీఫ్ జనరల్ సెక్రటరీ అత్తలూరి కృష్ణకిరణ్ పిలుపునిచ్చారు. ఆదివారం పశువులవాణి ఆలయంలో సమావేశం ఏర్పాటు చేశరు. పామయ్య యాదవ్, ఆర్యవైశ్య సంఘం యువజన ఉపాధ్యక్షుడు వేముల శేషు పాల్గొన్నారు.

టీడీపీతోనే తండాల అభివృద్ధి



రోళ్లపాడు తండాలో సీసీ రోడ్డు పనులు

తుగ్గలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీతోనే తండాలు అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ గిరిజన నాయకుడు తులసి నాయక్ అన్నారు. ఆదివారం రోళ్లపాడు తండాలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గుక్కెడు మట్టి కూడా వేయలేదని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మిస్తున్నామన్నారు. గతంలో కూడా టీడీపీ హయాంలో మాజీ ఉప ముఖ్య మంత్రి కేఈ కృష్ణమూర్తి సహకారంతో సీసీ రోడ్లు వేశారన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. రాజు నాయక్, శ్రీను నాయక్, బండయ్య ఉన్నారు.

సెలవుల్లో తరగతుల నిర్వహణపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సెలవు దినాల్లో తరగతులు నిర్వహించే కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సంతోష్, శశిధర్ ప్రతాప్, యశ్వంత్, మధు, సూరి పాల్గొన్నారు

లైసెన్స్ లేకుంటే వాహనాల సీజ్

మద్దికెర, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా నడిపితే వాహనాలను సీజ్ చేస్తామని ఎస్ఐ విజయకుమార్ నాయక్ హెచ్చరించారు. ఆదివారం పోలీస్ స్టేషన్ ఆవరణంలో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. హెల్మెట్ ధరించాలని, ఇన్సూరెన్స్ లేకుంటే భారీ మొత్తంలో జరిమానా విధిస్తామన్నారు. తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

ఆదోని, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణదినం పురస్కరించుకుని పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు భీమాస్ సర్కిల్ నుంచి ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని టూటౌన్ సీఐ సూర్య మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. ఎయిడ్స్ రోగులను ఆదరించాలని, వారిని హత్తుకున్నా, షేక్‌హాండ్ ఇచ్చినా వ్యాధి రాదన్నారు. అరక్షిత సెక్స్, వ్యాధి సోకిన వారి రక్తం ఎక్కించడం ద్వారా మాత్రమే వ్యాపిస్తుందన్నారు. బాధితులకు మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. న్యాయవాదులు లోకేష్, ఆనంద్, మేరి, బాలకృష్ణ, ఈరన్న, సుబ్బన్న, రంగస్వామి పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో సత్తా

- జాతీయ పోటీలకు ఎంపిక
- కస్తూర్భా విద్యార్థినుల ప్రతిభ



బాక్సింగ్ సాధన చేస్తున్న కేజీబీవీ విద్యార్థినులు

ఆలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా గాంధీ విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారు. సాధారణంగా అమ్మాయిలు బాక్సింగ్ అంటే ఇష్టపడరు. వాలీబాల్, ఖోఖో, పరుగు పందెం వంటి క్రీడలనే ఇష్టపడతారు. అయితే ఈ పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరచి పథకాలు సాధిస్తున్నారు. ఆత్మరక్షణకు ఉపయోగపడే బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. వీరి ఆసక్తిని గమనించిన ఎస్‌వో సుహాసిని, పీఈటీ సులోచన ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం తర్ఫీదు ఇస్తున్నారు. దీంతో వీరు బాక్సింగ్‌లో రాణిస్తున్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు అశ్విత, శిరీష, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 2,3వ తేదీల్లో శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సీనియర్ విభాగంలో అశ్విత, శిరీష బంగారు పతకాలు సాధించగా, కీర్తన, మధు, మేఘన వెండి, హేమ మాలిక కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. మరో ముగ్గురు రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రశంసా పత్రాలు అందుకున్నారు. త్వరలో జమ్మూ కాశ్మీర్‌లో నిర్వహించనున్న పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొననున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరింత రాణిస్తామంటున్నారు.



ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తాం

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచేలా ప్రిన్సిపాల్, పీఈటీ ప్రోత్సహించారు. ఉదయం, సాయంత్రం శిక్షణ ఇచ్చారు. బాక్సింగ్‌తో ఆకతా యిల నుంచి రక్షణ పొందవచ్చు.. రాష్ట్రస్థాయిలో బంగారు పతకాలు సాధించాం.. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తాం. **- అశ్విత, ఇంటర్ విద్యార్థిని.**

ఆనందంగా ఉంది

నా తల్లిదండ్రులు వ్యవసాయం చేసి నన్ను చదివిస్తున్నారు. బాక్సింగ్‌ను సాధన చేసి రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు అందుకోవడం ఆనందంగా ఉంది. త్వరలోనే జాతీయ స్థాయి సీనియర్ విభాగంలో పాల్గొంటున్నాను. **- శిరీష, ఇంటర్.**



చిన్నారులకు ఆర్థికసాయం



నగదు అందచేస్తున్న సహృదయ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

ఆదోని, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలకు ఆదోని సహృదయ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు రూ.21వేల ఆర్థికసాయం అందజేశారు. పత్తికొండ మండలం చందోలి గ్రామానికి చెందిన ఆంజనేయులు, లక్ష్మి దంపతులు ఇటీవల మృతి చెందారు. వీరికి జయశ్రీ, అంకిత, ఉషశ్రీ అనే ముగ్గురు ఆడపిల్లలు. దీంతో నాయనమ్మ రంగమ్మ అన్నీ తానై బాగోగులు చూస్తుంది. ఏడో తరగతి చదువుతున్న జయశ్రీ ఏడో తరగతి, చదువుతున్న అంకిత అయిదో తరగతి చదువుతుండగా మరో చిన్నారి ఉషశ్రీ ఇంటి వద్దే ఉంది. వీరిని గుర్తించిన సభ్యులు గ్రామానికి వెళ్లి నగదు అందచేశారు. పిల్లల చదువు పూర్తయ్యే వరకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. గిరి, పెద్దయ్య, రఘు, ప్రకాష్, గౌడ్, సోమప్ప పాల్గొన్నారు.

సీపీఎం మహాసభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న నాయకుడు కేపీ నారాయణ స్వామి

ఆలూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డిసెంబర్ 4న నిర్వహించనున్న సీపీఎం మహాసభను జయప్రదం చేయాలని పార్టీ నాయకుడు కేపీ నారాయణ స్వామి కార్యదర్శి షాకీర్ పిలుపునిచ్చారు. ఆదివారం జ్యోతిబసు భవనంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వేదవతి ప్రాజెక్టును 8టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆలూరు ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు పరిశ్రమల ఏర్పాటు చేయాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారానికి తాము నిరంతర పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈరన్న విఠల్, కృష్ణ నాగరాజు, షేకున్ బీ రత్నమ్మ, గౌసియ పాల్గొన్నారు.

కుట్టు మిషన్లను మంజూరు చేయాలి



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

ఆదోని టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కుట్టులో శిక్షణ పొందిన మహిళలకు ప్రభుత్వం కుట్టు మిషన్లను మంజూరు చేయాలని దుల్హా పైల్వాన్ మసీదు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు షేక్ అల్లాబకాష్, షేక్ జిక్రియ డిమాండ్ చేశారు. ఆదివారం మసీదు కమిటీ ఆధ్వర్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న 180 మంది మహిళలకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కులమతాలకతీతంగా తక్కువ ఫీజుతో శిక్షణ అందిస్తున్నామని, త్వరలో పేద పిల్లలకు ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ఖతిబ్ సాబ్, జునైద్ హష్మీ, కమిటీ సభ్యులు సీనియర్ జర్నలిస్ట్ మొహమ్మద్, ఖాదర్ బాషా, ఇమామ్ సాబ్, మునావర్ సాబ్, దాదాదాషా, రషీద్ పటేల్, న్యాయవాది ఇస్మాయిల్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా నిలిపివేసిన కాంట్రాక్టర్లు



ముద్దనగేరిలో ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్థులు

ఆలూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరుపాపురం, చింతకుంట, సమ్మతగేరి జలాశయం నుంచి 12 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. తమకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు నిలిపి వేశారు. దీంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తింది. ఆదివారం కాంట్రాక్టర్లు నాగేంద్ర, పుల్లయ్య, లక్ష్మీకాంత్ విలేకరులతో మాట్లాడుతూ 12నెలలగా బిల్లులు ఇవ్వం లేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. జలాశయాల నిర్వహణ రికార్డులను జిల్లా పరిషత్‌కు పంపారని అధికారులు చెప్పారన్నారు. ఉన్నతాధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆదివారం అమావాస్య పూజలు

హొళగుంద, డిసెంబరు 1, (ఆంధ్రజ్యోతి): దేవరగట్టులో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకులు మహేష్, మల్లయ్య ఆదివారం తెలిపారు. తెల్లవారుజాము నుంచి మహో మంగళహారతి, ఆకుపూజ, రుద్రభిషేకం, తదితర పూజలు నిర్వహించారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు.



పురపాలక కార్యాలయం వద్ద నిలిపిన చెత్త సేకరణ వాహనాలు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వాహనాలు మూలకు పడ్డాయి. పట్టణ పురపాలక కార్యాలయంలో దాదాప 30 వాహనాలు మూడు నెలలుగా మూలకు చేరడంతో టైర్లలో గాలిపోయి, చక్రాలకు తుప్పు పట్టి పనికిరాకుండా పోతున్నాయి. రూ.లక్షల ప్రజాధనాన్ని ఇలా చేయడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

టీడీపీ సభ్యత్వంతో ప్రమాద బీమా



ఆటేకల్‌లో సభ్యత్వ నమోదు చేస్తున్న వైకుంఠం శివప్రసాద్

ఆస్పరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కేవలం రూ.వందతో సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల ప్రమాద బీమా, రూ.10వేలు మట్టి ఖర్చులు ఇస్తున్న ఐక్రైక పార్టీ టీడీపీ మాత్రమేనని ఆ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అన్నారు. ఆదివారం ములుగుంద, ఆటేకల్, బిలేకల్, అలిగెర, చిరుమాం దొడ్డి గ్రామాల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. వైకుంఠం జ్యోతి ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వం నమోదు జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. మాజీ ఎంపీపీ కృష్ణ యాదవ్, వెంకటేష్ జీవన్ కుమార్ నౌనేపాటి చౌదరి, సంజన, మహేష్, వీరేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం



ఉప్పర్లపల్లిలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం ప్రభుత్వంతో సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు అప్పా వేణుగోపాల్ అన్నారు. ఆదివారం ఉప్పర్లపల్లిలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తున్నారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి, ఉపాధి పనుల కింద రహదారులు నిర్మిస్తున్నారన్నారు. అలాగే ఉప్పర్లపల్లిలో రక్షిత తాగునీటి ప్లాంటును పునః ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరారు. మనోహర్, సుంకన్న చౌదరి, విద్యాకమిటి ఛైర్మన్ కంబగిరి ఉన్నారు.

ఇన్‌చార్జి ఏపీఎంగా నర్సన్న

దేవనకొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల వెలుగు ఇన్‌చార్జి ఏపీఎంగా నర్సన్నను జిల్లా అధికారులు బదిలీ చేశారు. ఆస్పరి ఏపీఎం జనార్ధన్ దేవనకొండ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తుండగా, డీఆర్‌డీఏ పీడీ శివలీలా ఆదేశాల మేరకు హెచ్‌డీ సీసీగా ఉన్న నర్సన్నకు మండల ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించారు.



శిథిలావస్థకు చేరిన తుగ్గలి వ్యవసాయ కార్యాలయం

తుగ్గలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పదిహేనేళ్ల క్రితం 5సెంట్ల స్థలంలో వ్యవసాయ కార్యాలయ భవనాన్ని నిర్మించారు. ఈ స్థలాన్ని దాత తుగ్గలి నాగేంద్ర ఇచ్చారు. అయితే దీన్ని ఉపయోగించకపోవడంతో ప్రనస్తుతం శిథిలావస్థకు చేరింది. దీంతో పాత కార్యాలయంలోనే సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ పరికరాల నిర్వహణ కష్టంగా ఉందని సిబ్బంది వాపోతున్నారు. కార్యాలయంలో రైతులు కూడా ఇబ్బంది గురవుతున్నారు. అధికారులు స్పందించి, మరమ్మతులు చేయించాలని అధికారులు, రైతులు కోరుతున్నారు.

రీసర్వే భూ సమస్యలను పరిష్కరిస్తాం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- తుగ్గలి తహసీల్దార్ రమాదేవి



తుగ్గలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రీసర్వే గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరిస్తామని తుగ్గలి తహసీల్దార్ రమాదేవి అన్నారు. ఆమె ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకున్నారా?

జవాబు: ఫిర్యాదులు వస్తే రికార్డులు పరిశీలించి భూమిని స్వాధీనం చేసుకుంటాం.

ప్రశ్న: రీసర్వే సమస్యలను పరిష్కరించారా?

జవాబు: రీసర్వే చేసిన గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి అర్జీలు తీసుకున్నాం, వాటన్నింటినీ త్వరలో పరిష్కరిస్తాం

ప్రశ్న: సర్టిఫికెట్లు సకాలంలో ఇస్తున్నారా?

జవాబు: కుల, ఆదాయ ధ్రువీకరణ దరఖాస్తులను పరిశీలంచి వెంటనే మంసూరు చేస్తున్నాం.

ప్రశ్న: ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలు పరిష్కారం అవుతున్నాయా?

జవాబు: ఇప్పటి వరకు అర్జీలను సంబంధిత అధికారులకు పంపి, సమస్యలను బట్టి దాదాపు పరిష్కరించాము. మిగిలిన అర్జీలను కూడా పరిష్కరించేలా చూస్తాం.

ప్రశ్న: రేషన్ బియ్యం పంపిణీ ఎలా సాగుతోంది?

జవాబు: ప్రతి నెలా స్టాక్ పాయింట్ నుంచి సరుకులు డీలర్ షాపులకు 1వ తేదీకే చేరుతున్నాయి. 1వ తేదీ నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికి అందిస్తున్నాము.

ప్రశ్న: అక్రమ లే అవుట్లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: అనుమతి లేకుండా లే అవుట్లు వేసిన వారికి నోటీసులు ఇచ్చాం. సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించకుంటే రాళ్లను తొలగించి చర్యలు తీసుకుంటాం.

స్వర్ణ పల్లకిలో విహరించిన రాఘవేంద్రులు



స్వర్ణపల్లకిలో ఊరేగుతున్న రాఘవేంద్రులు

మంత్రాలయం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం అమావాస్య శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్ర స్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్టించి అంగరంగ వైభవంగా ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు భక్తులకు ఫల,పుష్ప, మంత్రాక్షితలు పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వేలాది మంది భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు.

మంత్రాలయంలో పోటెత్తిన భక్తులు



మఠం ప్రాంగణంలో భక్తులు రద్దీ

మంత్రాలయం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. ఆదివారం సెలవు దినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర నది తీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవాల ఊరేగింపులో పాల్గొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులు పొందారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మఠం అధికారులు క్యూలైన్లు, పరిమళ ప్రసాదం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

● రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథం పై విహరించారు. కార్తీక ఆదివారం పర్వ దినాన్ని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాఘవరాయుడికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి స్వర్ణ కవచంతో చూడముచ్చటగా అలంకరించారు. నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయులను అధిష్టించి ఊరేగించారు.

త్రైతసిద్ధాంత ప్రభోద ప్రచారం



పెద్దనేలటూరులో ప్రచారం నిర్వహిస్తున్న త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారకులు

గోనెగండ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల మండల పరిధిలోని పెద్దనేలటూరు గ్రామంలో ఆదివారం త్రైతసిద్ధాంత ప్రభోద సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక కమిటీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. హిందు మతం యొక్క గొప్పతనం, సనాతన ధర్మం, కార్తీక దీపారాధన గురించి వివరించారు. దీపాలను వెలిగించడం అందులో దాగి ఉన్న జ్ఞానం తెలుసుకోవాలన్నారు. అలాగే ఆదివారం సృష్టి మొదలుకు గుర్తు అని, సోమవారం ఆత్మజ్ఞానానికి, మంగళవారం మోక్షానికి గుర్తు అని తెలిపారు. భగవద్గీత పుస్తకాలను గ్రామంలో భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, సువర్ణ, రామమ్మ, మనిషా, స్వప్న పాల్గొన్నారు.

రైల్వే వ్యాగిన్ వెంటనే పూర్తి చేయండి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రైల్వే వ్యాగిన్‌ను వెంటనే పూర్తి చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. ఆదివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శి ప్రకాస్ అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ పంచలింగాల సమీపంలో రైల్వే వ్యాగిన్ నిర్మాణం చేసి మండలంలోని యువతకు, ఉద్యోగాలు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చి పది సంవత్సరాలు అవుతుందన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా నత్తనడకన నడుస్తున్న కర్నూలు రైల్వే వ్యాగిన్ ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వెంటనే కర్నూలు రైల్వే వ్యాగిన్ పూర్తి చేసి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో మండల నాయకులు సురేష్, హరికిషన్ రెడ్డి, వై.శంకర్, దివాకర్, నాగప్ప, రాజు, సభ్యులు ఎస్.రాజు, రాము, దస్తగిరి మహేష్, అంజి, హరి పాల్గొన్నారు.





నిరుపయోగంగా ఉన్న షెడ్లు

నిరుపయోగంగా చేనేత షెడ్లు

- రూ. 64లక్షల ప్రజాధనం వృథా

నందవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో చేనేతల కోసం నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారాయి. 2009లో వరదల వల్ల నాగలదిన్నె గ్రామం ముంపునకు గురైయ్యింది. గ్రామంలో ఎక్కువగా చేనేతలు ఉండండతో చేనేత ముడి సరకు మొత్తం వరదలో కొట్టుకుపోయింది. అప్పటి ప్రభుత్వం గ్రామంలోని ఎత్తైన ప్రాంతంలో దాదాపు 2000పట్టాలు గ్రామస్తులకు ఇచ్చింది. చేనేతలందరికి ఇచ్చిన పట్టా స్థలంలోనే ఇళ్లు కూడా నిర్మించి, అదే ప్రదేశంలో చేనేతలకు ప్రత్యేకంగా ఎనిమిది షెడ్లను ఏర్పాటు చేసింది. ఒక్కొక్క షెడ్ నిర్మాణానికి రూ. ఎనిమిది లక్షల చొప్పున రూ. 64 లక్షలు వెచ్చింది. చేనేత మగ్గాలు, ముడిసరుకులు ప్రభుత్వం ఉచితంగా అందించి మగ్గం నేసినందకు ప్రతి చేనేతకు రూ. 75 ప్రకారం రోజు వారిగా కూలి ఇచ్చేది. అలా అందులో 150 మంది దాకా పని చేసేవారు. మొదట్లో చేనేతలు ఆ షెడ్లల్లో మగ్గం నేసుకుని సాయంకాలం ఇళ్లకు వెళ్లేవారు. రెండేళ్ల తర్వాత చేనేతలు కొంతమంది పాత నాగలదిన్నె గ్రామంలోకి వెళ్లారు. దీంతో ఆ షెడ్లల్లో దొంగల పడి ముడిసరుకు ఎత్తుకెళ్లారు. దీంతో చేనేతలు షెడ్లను వదిలేశారు. అప్పటి నుంచి వృథాగానే మారాయి. రైతులు ఆ షెడ్లల్లో పంట ఉత్పత్తులు పెట్టుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చేనేత వృత్తిపైన ఆధారపడి జీవించేవారికి పలు రాయితీలు ఇచ్చేందుకు హామీలు ఇచ్చింది. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిరుపయోగంగా మారిన షెడ్లను మళ్లీ చేనేతలకు ఇప్పించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

షెడ్లను మరమ్మతులు చేయించాలి

చేనేత పరికరాలు లేక చాలా మంది నేతన్నలు బతుకు తెరువు కోసం వలసలు వెళ్తున్నారు. చేనేత షెడ్లకు మరమ్మతులు చేయించాలి. సబ్సిడీ కరెంట్, చేనేత పరికరాలతో పాటు, ముడి సరుకులు ఇప్పించి ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఎల్లేష్, చేనేత కార్మికుడు, నాగలదిన్నె

దొంగలు అరెస్టు



వివరాలను తెలుపుతున్న సీఐ

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత నెలలో ఎమ్మిగనూరు పట్టణంలోని రెండు మద్యం దుకాణాలలో చోరీకి పాల్పడిన దొంగలను ఆదివారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. నవంబరు 14న బైపాస్ రోడ్డులోని ఎద్దుల మార్కెట్ దగ్గరలోని ఆదిలక్ష్మి వైన్స్, లక్ష్మణ్ టాకీస్ దగ్గర ఉన్న వీవీ వైన్స్‌ల్లో చోరీలు జరిగాయి. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీస్ బృందంతో నిందితులను పట్టుకునేందుకు ఎమ్మిగనూరు నుంచి దోర్నాల వరకు ప్రధాన రహదారి గుండా సీసీ పుటేజీలను పరిశీలించారు. అయితే నిందితులను, వారు ఉపయోగించిన స్కూటిని గుర్తించారు. అయితే నిందితులు మరోసారి దొంగతనం చేసేందుకు పట్టణానికి వచ్చారు. గోనెగండ్ల సర్కిల్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా మంగళగిరికి చెందిన మణికంఠ రెడ్డి, వినుకొండకు చెందిన పోగుల బాలవెంకట్‌లను అదుపులోకి తీసుకొని విచారించారు. మద్యం షాపుల్లో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రూ. 70వేల నగదు ఒక కట్టర్, స్క్రూ డ్రైవర్, స్కూటి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. దొంగలను గుర్తించడంలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడ్డాయని సీఐ అన్నారు. సాంకేతికతను వినియోగించుకొని దొంగలను అరెస్ట్ చేయడంతో సీఐ, ఎస్సై, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

భారత పౌరుడికి రాజ్యాంగం పవిత్ర గ్రంథం



మాట్లాడుతూన్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాశీంవలి

ఎమ్మిగనూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ప్రతి పౌరుడికి రాజ్యాంగం ఓ పవిత్ర గంద్రమని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాశీంవలి, సీపీఎం నాయకులు గోవింద్, రంగన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని రాజ్యాంగం లక్ష్యాలు దాని ప్రాముఖ్యత అనే అంశంపై సెమినార్‌ను కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దైవసహాయం, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు దేవేంద్రబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పిస్తూ అందరితో సమానంగా జీవించే హక్కును ఆర్టికల్ 21లో చేకూర్చిందన్నారు. నేడు దేశాన్ని పాలిస్తున్న పాలక ప్రభుత్వాలు కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతున్నాయని, ఇది కూడా రాజ్యాంగానికి విఘాతం అన్నారు. స్వేచ్ఛ ,సమానత్వం సాధించినప్పుడే సామాజికి చైతన్యం సాధ్యమవుతుందన్నారు. రాజ్యాంగంలోని సామ్యవాదం, సోషలిజం అనే పదాలను తొలగించాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్‌లు ప్రయత్నిస్తున్నాయన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాడానికి ప్రతి పౌరుడు నడుం బిగించాలన్నారు. సమావేశంలో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసి కార్యదర్శి రాజు, యూటీఎస్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, ఎంపీజే నాయకులు ఖాదీర్, నాయకులు పాల్గొన్నారు.

గుడిసెలులేని గ్రామాలుగా తీర్చిదిద్దడమే ధ్యేయం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఐదేళ్లలో కూటమి ప్రభుత్వం గుడిసెలు లేని గ్రామాలను తీర్చిదిద్దాలనే ధ్యేయంతో పని చేస్తుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొంతింటి కల నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం ఇల్లు లేని ప్రతి పేదవానికి స్వంత ఇల్లు నిర్మించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.1.80 లక్షలు ఇంటికి మంజూరు చేస్తే.. కూటమి ప్రభుత్వం రూ2.50లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ప్రధానమంత్రి అవాస్ యోజన (పీఎంఏవై) పథకం కింద కొత్త గృహాలకు మంజూరుకు గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్, హౌసింగ్ అధికారులకు దరకాస్తులు చేసుకోవాలని కోరారు. సొంత స్థలం ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇల్లు కట్టుకోలేని పేదలకు గ్రామ నాయకుడు, కార్యకర్తగా అండగా ఉండి చేయూతనందించాలని అన్నారు. నాలుగు మండలాల్లోని టీడీపీ కార్యకర్తలు అర్హులైన ప్రతి ఒక్కరు దరఖాస్తు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

గోనెగండ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గోనెగండ్ల ఎస్సీ కాలనీకి చెందిన సుంకులమ్మ(81) అనే వృద్ధురాలు కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు.. నాలుగు రోజుల క్రితం సుంకులమ్మ స్నానం చేసేందుకు ఇంట్లో పొయ్యిపై వేడినీళ్లు పెట్టింది. ప్రమాదవశాత్తు ఆమె చీరకు నిప్పు అంటుకుంది. మంటలు వ్యాపించడంతో కేకలు వేసింది. అక్కడ ఉన్న వారు మంటలను ఆర్పివేసి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు నల్లన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'హిందూ ధర్మం గొప్పతనం తెలుసుకోవాలి'



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా కన్వీనర్ తొగట నరసింహులు

పెద్దకడుబూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు హిందూ ధర్మం గొప్పతనం తెలుసుకోవాలని బీజేపీ జిల్లా కన్వీనర్ తొగట నరసింహులు, ఆర్ఎస్ఎస్ ఎమ్మిగనూరు ఖండప్రచార ప్రముఖ్ వీరేష్ లు అన్నారు. ఆదివారం పెద్దకడుబూరులోని రామలక్ష్మణ దేవాలయంలో హైందవశంఖారావం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ధర్మం అంటే ఏమిటో తెలుసుకోవాలన్నారు. దేవాదాయ శాఖను ప్రభుత్వం నుంచి తొలగించి హిందువుల సనాతన బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. జనవరి 5న విజయవాడలో జరిగే భారీ బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నామని ఈ సభకు ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



వాహనాల రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని కలుగొట్ల రోడ్డులో రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు వాహనాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ఇలా ఉంటే ఎలా?

● ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆగ్రహం
● ఇంటిగ్రేటెడ్ హాస్టల్ తనిఖీ



ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆవరణలో మురుగునీరును పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

కోసిగి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్‌లో పరిశుభ్రత తప్పక పాటించాలని, ఇలా అపరిశుభ్రంగా ఉంటే ఎలా అని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఇంటిగ్రెటెడ్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్ వార్డెన్ కోటేశ్వరయ్య లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ ఆవరణంలో నిలిచిన మురుగునీటిని పరిశీలించారు. హాస్టల్‌కు మెట్లు సరిగ్గా లేకపోవడంతో ఎలా నడవాలని అధికారులను ప్రశ్నించారు. ప్రతి గదిని విద్యార్థులతో కలిసి పరిశీలించారు. వంట గదిని, టాయిలెట్స్, నీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకులను పరిశీలించారు. హాస్టల్‌లో ఎలాంటి మౌలిక వసతులు లేవని, తాగునీటి సమస్య, సరైన విద్యుత్ సదుపాయం లేదని, మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. హాస్టల్‌లో చాలా సమస్యలు ఉన్నాయనీ, వాటికి సంబంధించి త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మండల అధికారులు వారానికి ఒకసారి పర్యవేక్షించాలని ఆదేశించారు. హాస్టల్ ఆవరణంలో మద్యం తాగేవారిపై కేసులు నమోదు చేయాలని ఎస్ఐ చంద్రమోహన్‌ను సూచించారు. అలాగే హాస్టల్ పరిసరాల్లో చెత్తాచెదారం వేయకుండా సమీపంలోని కాలనీవాసులకు నోటీసులు అందించాలని, మలమూత్ర విసర్జనలు చేసేవారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. అనంతరం బియ్యం స్టాంగ్ రూమ్‌లో ఉంచి రికార్డులు సరిగ్గా చూపకపోవడంతో హాస్టల్లోని ప్రైవేటు వ్యక్తులపై సబ్ కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట నిర్వాహకులు మెనూ సక్రమంగా పాటించడం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నిత్యానందరాజు, డీటీ రుద్రగౌడు, ఎస్ఐ చంద్రమోహన్, ఆర్ఐ శ్రీరాములు, తదితరులున్నారు.



హాస్టల్‌లో భోజనం పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ఘనంగా లక్ష పుష్పార్చన



స్వామికి వారి లక్ష పుష్పార్చన కోసం పుష్పాలను తీసుకువస్తున్న భక్తులు



కౌతాళం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆదివారం అమావాస్య సందర్భంగా ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజయరాజు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదోనికి చెందిన భక్తుడు జీఎల్ సంజీవరెడ్డి కుటుంబసభ్యులు పాల్గొని స్వామి వారికి పుష్పార్చన చేశారు. అంతకు ముందు అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మరి కొంతమంది భక్తులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వంటకాలు చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు.

పైరాయ ఆంజనేయ స్వామికి కేజీ వెండి విరాళం



పైరాయ ఆంజినేయ స్వామికి కేజీ వెండి విరాళంగా అందజేస్తున్న భక్తులు

పెద్దకడుబూరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసలదొడ్డి గ్రామంలోని వెలసిన పైరాయ ఆంజనేయ స్వామికి ఓ భక్తుడు కేజీ వెండి విరాళాన్ని సమర్పించినట్లు ఆలయ అర్చకుడు రామకృష్ణస్వామి తెలిపారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని బసలదొడ్డికి చెందిన జగన్నాథ్ అనే భక్తుడు ఆంజనేయస్వామి విగ్రహానికి రూ.లక్ష పదివేలతో కేజీ వెండి తోకను చేయించారన్నారు. సోమవారం ఉదయం 7గంటలకు స్వామివారి శోభాయాత్ర ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని అర్చకులు రామకృష్ణస్వామి, వెంకటేష్‌స్వామి కోరారు.

ఘనంగా ప్రభోత్సవం



పార్లపల్లిలో ఆంజనేయస్వామి ప్రభోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పార్లపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ప్రభోత్సవాన్ని ఆదివారం అమావాస్య రోజున ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల ఉత్సవ మూర్తులను ప్రభోత్సవంపై ఆశీనులను చేసి ప్రభోత్సవాన్ని నిర్వహించారు.

కోడుమూరు రూరల్: మండలంలో వివిధ గ్రామాల్లో కార్తీక అమావాస్య పూజలు వైభవంగా జరిగాయి. ముఖ్యంగా ప్యాలకుర్తి భీమలింగేశ్వరస్వామి, వర్కూరు సిద్ధేశ్వరస్వామి, లద్దగిరి రామలింగేశ్వరస్వామి, గోరంట్ల లక్ష్మీమాధవస్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

ఆలయాల్లో కార్తీక పూజలు



గోనెగండ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక అమావాస్య ఆదివారం కావడంతో చింతలాముని స్వామి, ఈశ్వరదేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి ప్రత్యేక వెండి అలంకరణ, పూలతో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం చింతామునిస్వామి, ఈశ్వరదేవాలయంలో హిందుసమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. హిందూమతం, పండగల ప్రాముఖ్యతలను గురించి వక్తలు వివరించారు. అలాగే మండల పరిధిలోని గాజులదిన్నె, కులుమాల, అలువాల, హెచ్ కైరవాడి, పెద్దనేలటూరు, చిన్ననేలటూరు, వేముగోడు, గంజహళ్లి, బైలుప్పల, అగ్రహారం గ్రామాల్లో కార్తీక ఆదివారం అమావాస్య పూజలను జరుపుకున్నారు. ఈశ్వర దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోనెగండ్లలోని నీలకంఠేశ్వరదేవాలయంలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్యస్వామి మహా రుద్రాభిషేకం నిర్వహించారు.

పంటలను ముసురు ముంచుతోంది

- మిరపకు బూడిద తెగులు, రాలిపోతున్న కంది పూత



పూత రాలిపోతున్న కంది పంట

గోనెగండ్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రెండు, మూడు రోజులుగా ఆకాశం మేఘావృతమే కారుమబ్బులు కమ్ముకోవడంతో చేతికి అందే పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ముసురు కమ్ముకోవడంతో మిరపపంటకు బూడిదతెలుగు సోకింది. దీంతో పూత రాలిపోవడం, కాయ రాలిపోవడంతో పాటు కాయ రంగు మారి పోతుంది. దీంతో ఉన్న కాయలకు కూడా ధర పలకదని రైతులు వాపోతున్నారు. మండలంలో దాదాపు 6000 ఎకరాల్లో మిరప పంటను సాగు చేశారు. మిరపకు గిట్టుబాటు ధర ఉందన్న సమయంలో ఈ ముసురు ముంచుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అలాగే కంది పంటను మండలంలో 2000 ఎకరాలలో సాగు చేశారు. ముసురు కారణంగా కంది పంట పూత కూడా రాలిపోతుందని రైతులు తెలుపుతున్నారు. ఏది ఏమైన ఈ ముసురు మిరప, కంది, వేరుశనగ పంటలకు ఇబ్బందిగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బూడిద తెగులు సోకిన మిరప పంట